




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 73 | ది. 19-6-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 73 | Date : 19-6-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


# పేద-మధ్య తరగతికి పారిశ్రామికాభివృద్ధి ఫలాలు

- ఇథనాల్... సెమీ కండక్టర్ల పరిశ్రమలకు ప్రోత్సాహం
- మైక్రో ఇరిగేషన్ ఎక్విప్మెంట్ పార్క్ ఏర్పాటుకు చర్యలు
- పారిశ్రామిక ప్రాంతాల వద్ద తక్కువ ధరలో ఇళ్ల నిర్మాణం
- 18వ ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 18వ ఎస్ఐపీబీ సమావేశంలో రూ.30515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం







**అమరావతి,జూన్ 18 (వార్తాప్రభ) :** పారిశ్రామికాభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఏపీలో ఏర్పాటయ్యే పారిశ్రామిక ఎకో సిస్టంను రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమలు, కంపెనీలను ధనికులే స్థాపించగలరనే భావన పోయేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో 18వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ కంపెనీల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. మొత్తంగా 50 కంపెనీలకు సంబంధించి రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ కంపెనీల ద్వారా మొత్తంగా 29677 ఉద్యోగాలు రానున్నాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలి. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా పేద, మధ్య తరగతి వారికి ఉద్యోగాలు కల్పించడమే కాదు... సామాన్యులు కూడా కంపెనీలు స్థాపించే అవకాశం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు స్టార్టప్ కంపెనీలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ సేవలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలి. ఆర్టీఐహెచ్ పరిధిలోని స్టార్టప్ కంపెనీలకు వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు వచ్చేలా చూడాలి. ఈ విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి. దీనికి అనుగుణంగా ఎకో సిస్టం ఏర్పాటు చేసే అంశంపై అధికారులు ఫోకస్ పెట్టాలి. ఇక వచ్చే పరిశ్రమలకు అనుగుణంగా కరిక్యులమ్ తయారు చేసే దిశగా విద్యా శాఖ ఆలోచన చేయాలి. పరిశ్రమలు, ప్రాజెక్టుల్లో ఎలాంటి ట్రెండ్స్ వస్తున్నాయో గమనించి దానికి అనుగుణంగా కరిక్యులమ్ రూపొందించాలి. రోబోటిక్స్ లాంటి ఆధునిక టెక్నాలజీ కోర్సులు కూడా మన విద్యా సంస్థల్లో ఉండాలి. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి నాన్ సీరియస్ ప్లేయర్స్ కు ఏపీలో చోటు లేదు. ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాక... వెంటనే పనులు మొదలు పెట్టేలా చూడాలి. పనులు ప్రారంభించని సంస్థలతో టచ్ లో ఉంటూ ఫాలో అప్ చేయాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

**ఆటోమేషన్ లో పారిశ్రామిక అనుమతులు..** "ఇథనాల్ తయారీ విషయంలో ముందడుగు వేయాలి. 40 శాతం ఇథనాల్ బ్లెండ్ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సాహిస్తే... రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఇథనాల్ బేస్డ్ ఇంధనం ఎక్కువగా ఉపయోగిస్తే దిగుమతి చేసుకునే ఇంధన భారం తగ్గుతుంది. బయో ఫ్యూయల్స్ రంగాన్ని మరింత ప్రోత్సహించాల్సి ఉంది. ఈ విషయంపై ఆయిల్ కంపెనీలతో సంప్రదింపులు జరపాలి. అలాగే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు తీసుకురావడంతో పాటు.. విద్యుత్ సరఫరా అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా ప్రాజెక్టులు వచ్చేలా చూడాలి. ఈ ఏడాది డిమాండ్ లో 17 శాతం వృద్ధి నమోదైంది. ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య విభాగాల వినియోగానికి అనుగుణంగా విద్యుత్ ఎంత అవసరం అవుతుందో అంచనాలు తయారు చేయాలి. సోలార్ విండ్, పంప్డ్ స్టోరేజితో పాటు దీజూూా టెక్నాలజీకే ఇక భవిష్యత్తు. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీకి అనుగుణంగా పంప్డ్ స్టోరేజి సహా ఇతర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు చేపట్టాలి. లిథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఈవీలకు ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీలపై దృష్టి పెట్టాలి. బ్యాటరీ టెక్నాలజీపై ఎక్కువ దృష్టి పెట్టండి. డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో విద్యుత్ వినియోగం అనేది అత్యంత కీలకం. డేటా సెంటర్ల అనుమతుల విషయంలో దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి. సెమీ కండక్టర్లపై ఎక్కువ దృష్టి సారించాలి. దానికి సంబంధించిన ఎకోసిస్టంపై ఎక్కువ ఫోకస్ చేద్దాం. ఇక మైక్రో ఇరిగేషన్ రైతుల కోసం మైక్రో ఇరిగేషన్ ఎక్విప్మెంట్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి. మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీ కంపెనీలను ఎంకరేజ్ చేద్దాం. భవిష్యత్తులో హార్టికల్చర్, ఫ్లోరీకల్చర్ కు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. దీంతో మైక్రో ఇరిగేషన్ కు ప్రాధాన్యత పెరుగుతుంది. ఈ క్రమంలో మైక్రో ఇరిగేషన్ పరికరాల పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. దీని వల్ల రైతులకూ తక్కువ ధరలో మైక్రో ఇరిగేషన్ ఎక్విప్మెంట్ అందుబాటులోకి వస్తుంది. అమరావతిలో ఏఐ, ఆల్గారిథమ్స్ క్వాంటం అప్లికేషన్ల రూపకల్పన మొదలైంది. ప్రాజెక్టుల అనుమతులు, భూ కేటాయింపులు వంటివి సులభతరంగా అందించాలి. దీంతో పాటు రాజకీయ జోక్యం అనేది లేకుండా చూడాలి. అన్ని నిబంధనలు పాటించిన ప్రాజెక్టులకు ఆటోమోషన్ పద్దతిలో అనుమతులు లభించే విధానాన్ని అనుసరిస్తే.. రాజకీయ జోక్యం తగ్గిపోతుంది. ఆ దిశగా అధికారులు ఆలోచనలు చేయాలి. అమరావతి క్వాంటం వ్యాలీకి సంబంధించి ఓ ఎకోసిస్టమ్ రావాలి. టవర్లతో పాటు టెక్నాలజీ పార్క్ రావాలి. క్వాంటం అప్లికేషన్లతో పాటు క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు కూడా రావాలి. మరోవైపు ఆటోమొబైల్ పరిశ్రమలకు శ్రీసిటీ సహా అనంతపురం జిల్లా కూడా కీలకం. తిరుపతి, శ్రీసిటీలు రాయల్ ఎన్ ఫీల్డ్, ఇసుజు, హీరో లాంటి ఆటోమొబైల్ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయి. అనంతపురంలో కియా కార్ల ఉత్పత్తి జరుగుతోంది. పుట్టపర్తిలో 5వ జనరేషన్ ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కేంద్రం వేగంగా గ్రౌండ్ కావాలి. ఫైటర్ జెట్ తయారీ కేంద్రం పనుల విషయంలో నిరంతరం ఫాలో అప్ చేస్తూ ఉండాలి.

# పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలో నెం.1 ఆంధ్రప్రదేశ్

- కస్తూరిబా హాస్టళ్లలో బాలికలకు పూర్తిస్థాయి బెడ్స్ ఏర్పాటు చేయండి
- విద్యాశాఖ అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష



**అమరావతి,జూన్ 18 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెం.1స్థానంలో ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులను మంత్రి లోకేష్ అభినందించారు. కడప మోడల్ లో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించామని, మెగా పీటీఎం నాటికి పూర్తిస్థాయిలో కిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 430 కేజీబీవీల్లో విద్యనభ్యసిస్తున్న 1,06,360 మంది విద్యార్థినులకు 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నారు. కేజీబీవీలతో పాటు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటుచేయాలని మంత్రి ఆదేశించారు.

**జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు కిట్స్ పంపిణీ..** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్ల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసరమైన నిబంధనలను తొలగించాలని అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో నిర్ణయించిన ఫీజులను స్కూళ్ల వెలుపల బోర్డులపై ప్రదర్శించడంతోపాటు పబ్లిక్ డొమైన్ లో పొందుపర్చాలని అన్నారు.

**అనాథ పిల్లలకు 'తల్లికి వందనం'..** రాష్ట్రంలోని అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం డబ్బులు అందేలా పక్కా చర్యలు తీసుకోవాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఈ పథకం అమలు కోసం పిల్లల గార్డియన్ల వివరాలను కచ్చితంగా సేకరించాలని, ఒకవేళ ఎవరూ లేని పక్షంలో ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, అక్కడ నుండి పిల్లలకు అందేలా చూడాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేసి, వారి చదువు పూర్తయిన తర్వాత ఆ సొమ్మును స్వతంత్రంగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానం ఆలోచన చెయ్యాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అటువంటి నిర్ణయం తీసుకోవడం వలన తల్లిదండ్రులు లేని పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా, వారి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి అన్నారు.

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటును వేగవంతం చేయండి

- జులై 3నాటికి ప్రక్రియ పూర్తి కావాలి
- ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీ ఉండాల్సిందే
- సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంలా మార్చండి
- అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి,జూన్ 18 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ప్రతిపాదించిన 'గ్రీనింగ్ సొసైటీ' ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. జులై 3వ తేదీ నాటికి ఈ సొసైటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు. గ్రీనింగ్ సొసైటీకి సంబంధించిన నిబంధనలు, నియామకాలు, విధివిధానాల ప్రతిపాదనలన్నీ కచ్చితంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025కి అనుగుణంగానే ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో, ఎలాంటి కాలయాపన చేయకుండా సొసైటీ త్వరగా కార్యరూపం దాల్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక నర్సరీ ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా పంచాయతీలో ఏర్పాటు సాధ్యం కాకపోతే, కనీసం మూడు, నాలుగు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా చేసి, ఉమ్మడిగా ఒక నర్సరీ ఉండేలా వెంటనే పనులు ప్రారంభించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'వీబీ-జీ రామ్ జీ' పథకం కిందకు నర్సరీల పెంపకాన్ని కూడా అనుసంధానించాం. ఈ పథకం ద్వారా లభించే నిధులు, ఉపాధి దినాలను సమర్థంగా ఉపయోగించుకుని, గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి" అన్నారు.

**ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లండి..** పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చల్లడానికి 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం చేసినట్లు అటవీ శాఖ అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి తెలిపారు. ఈ వర్షాకాలంలోనే వీటిని అటవీ, ఖాళీ ప్రాంతాలలో వెదజల్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. కొండ కోనల్లో విత్తనాలను చల్లడానికి ఈసారి సుమారు 40 నుంచి 50 అత్యాధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రణాళికపై స్పందించిన పవన్ కళ్యాణ్ గారు, సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం చేయకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలి. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలను కలుపుకొని దీనిని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

# రైతు కష్టాన్ని అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు

- ఆక్వా, పొగాకు, తోతాపూరి మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి కీలక నిర్ణయాలు
- తోతాపూరి మామిడికి కేజీకి రూ.4 ప్రోత్సాహకం, ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గింపు, పొగాకు కనీస ధర రూ.200 తగ్గకూడదు
- రాష్ట్ర ఆర్థిక సవాళ్లు ఉన్నా రైతు సంక్షేమంలో రాజీ లేదు: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,జూన్ 18 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ చూపారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం సీఎం క్యాంపు కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడిన ఆయన, ఆక్వా ఫీడ్ ధరలు, వర్జీనియా పొగాకు కొనుగోళ్లు, తోతాపూరి మామిడి రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో విస్తృత సమీక్ష నిర్వహించి రైతులకు మేలు చేసే కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ పరిస్థితులు, ముడి సరుకుల ధరల పెరుగుదల కారణంగా ఫీడ్ కంపెనీలు ధరలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపినా, రైతులపై భారం పడకూడదన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు జోక్యం చేసుకున్నారని చెప్పారు. ఫీడ్ ధరలను ఏకపక్షంగా పెంచడానికి ప్రభుత్వం అనుమతించలేదని, రైతులు, కంపెనీల మధ్య సమన్వయం ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయానికి రావాలని సీఎం సూచించారని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరస్పర అంగీకారంతో పరిమిత స్థాయిలో ధరల సవరణకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఫీడ్ ధర కేజీకి ఇప్పుడున్న ఎంఆర్పీ రూ.112 నుంచి రూ.108కి తగ్గనుంది. ఆక్వా ఫీడ్ ధర స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులు, అధికారులతో ఒక కమిటీ వేయాలని, 20 రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించాలని, అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పినట్లు మంత్రి తెలిపారు.

**వర్జీనియా పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం..** అంతర్జాతీయ మార్కెట్లలో వర్జీనియా పొగాకు ఉత్పత్తి పెరగడం, ఎగుమతి పరిస్థితులు మారడం వల్ల ధరలు ప్రభావితమైనప్పటికీ రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. పొగాకు వేలం కేంద్రాల్లో అన్ని కొనుగోలు సంస్థలు తప్పనిసరిగా పాల్గొనాలని, పొగాకు బోర్డు పరిధిలోని అన్ని ప్లాట్‌ఫారమ్‌లు పూర్తిస్థాయిలో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. రైతులు తీసుకొచ్చిన పొగాకును తిరస్కరించే పరిస్థితి ఉండకూడదని, మార్కెట్‌లో పొగాకు రకం ఏదైనా కిలో రూ.200 కంటే తగ్గడానికి వీల్లేదని సీఎం ఆదేశించారని, పొగాకు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు.


**దస్తావేజు పోయినది**

ఎన్‌టిఆర్ జిల్లా, విద్యాధరపురం, అరవింద వీధి, డోరు నెం.1-3/25-10/9 కాపురస్తులు మల్లెల వెంకట సుబ్రమణ్య సోమయాజులు గారి కుమారుడు మల్లెల కృష్ణశాస్త్రి అను నాకు సంబంధించిన విజయవాడ సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో 1వ పుస్తకం,1668 వాల్యూం, 192 ల 197 పుటలలో నెం.9482/1982రుగా రిజిష్ట్రీ కాబడిన ఒరిజినల్ పార్టీషన్ దస్తావేజుతో పాటు మరికొన్ని కాగితములు కలిగిన కవర్‌ను ది.20-04-2026న విజయవాడ వన్‌టౌన్ నుండి భవానీపురంనకు బండిపై వెళుతుండగా మార్గమధ్యములో జారిపడిపోయినవి. వెంటనే చుట్టుప్రక్కల ఎక్కడ వెదకిననూ ఒరిజినల్ ఇంటి కాగితములు కనవడలేదు. కావున ఎవరికైనా దస్తావేజు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగపరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజును ఎవరికినీ తాకట్టు పెట్టుటగానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగియుండలేదని యిందుమూలముగా తెలియజేయు చున్నాను.

సెల్ నెం.9448997313


# రెండేళ్లలో గృహ నిర్మాణ రంగానికి నూతన ఊపిరి

- 4.50 లక్షల ఇళ్ల పూర్తి -- మరో 4 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి



**అమరావతి,జూన్ 18 (వార్తాప్రభ) :** రెండేళ్లలో గృహ నిర్మాణ రంగానికి నూతన ఊపిరి లభించిందని, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించగా, మరో 4 లక్షల గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం గృహ నిర్మాణ రంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా ముందుకు సాగుతోందన్నారు. పేదల గృహ భద్రత, సామాజిక స్థిరత్వం, జీవన ప్రమాణాల మెరుగుదల ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచారం విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గృహ నిర్మాణ రంగంలో సాధించిన ప్రగతి, అమలులో ఉన్న కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ సమగ్ర వివరాలు వెల్లడించారు. సొంత ఇల్లు అనేది ప్రతి కుటుంబం కల మాత్రమే కాకుండా ఆర్థిక భద్రతకు, సామాజిక గౌరవానికి, కుటుంబ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని అన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రారంభించిన పేదల గృహ సంక్షేమ దృక్పథాన్ని ముఖ్య మంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మరింత విస్తృత స్థాయిలో అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు, కొత్తగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఏఒక్క అర్హత కుటుంబం కూడా గృహం లేకుండా ఉండకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**2014--2019లో చారిత్రాత్మక గృహ నిర్మాణ కార్యక్రమం...** 2014--19 కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ రంగాన్ని పేదల సంక్షేమ కార్యక్రమాల్లో అత్యున్నత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించి, ప్రతి అర్హత గల కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో విస్తృత స్థాయిలో గృహ నిర్మాణ కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో గృహ నిర్మాణ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ, కేంద్ర ప్రభుత్వ సహాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా గణనీయమైన ఆర్థిక వనరులను సమకూర్చి పేదలకు నాణ్యమైన గృహాలను అందించే దిశగా చర్యలు చేపట్టిందన్నారు. ఈ కాలంలో మొత్తం 8,04,288 గృహాలు మంజూరు చేయబడగా, వాటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం విస్తృతంగా అందించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో గృహానికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.50 లక్షలు యూనిట్ వ్యయంగా నిర్ణయించి అమలు చేయడం జరిగిందన్నారు. అదనంగా నిర్మాణ వ్యయాల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తన వంతు భాగస్వామ్యాన్ని పెంచి లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గించే చర్యలు తీసుకుందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) దేశవ్యాప్తంగా అమలులోకి రాకముందే, పేదల గృహ అవసరాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం "ఎన్‌టీఆర్ హౌసింగ్" పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం జరిగిందన్నారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని అందించాలనే దృక్పథంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది కుటుంబాలకు గృహ భద్రత కల్పించబడిందన్నారు. గృహ నిర్మాణం అనేది కేవలం సంక్షేమ కార్యక్రమం మాత్రమే కాకుండా సామాజిక, ఆర్థిక సాధికారతకు పునాదిగా భావించిన ప్రభుత్వం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు మరియు ఇతర బలహీన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ గృహాల మంజూరు చేపట్టిందన్నారు. ఫలితంగా లక్షలాది పేద కుటుంబాలు సొంతింటి యజమానులుగా మారి సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవన ప్రమాణాలను పొందగలిగాయన్నారు. పేదలకు గృహాలు కల్పించడంలో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని, గృహ నిర్మాణ రంగంలో 2014--19 కాలంలో నమోదైన పురోగతి ఆంధ్రప్రదేశ్ సంక్షేమ చరిత్రలో ఒక కీలక అధ్యాయంగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు.

## మూడు సంవత్సరాల పరంపర విద్యార్థుల మహోన్నత ఆనందం



**విస్సన్నపేట,జూన్ 18 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కలగర ప్రాథమిక పాఠశాలలో తిరువూరు నియోజకవర్గ టిడిపి యువ నాయకులు ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు ఆర్థిక చేయూతతో ఆయన తల్లిదండ్రులు వల్లభనేని రాణి వెంకటేశ్వరరావు దంపతులు నోట్స్ లు, పెన్నులు, పలకలు తదితర స్టేషనరీ అందించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన కుమారుడు మూడు సంవత్సరాలుగా పాఠశాల విద్యార్థులకు బుక్స్ స్టేషనరీ అందించడం జరుగుతుందని చెప్పారు. మండల వ్యాప్తంగా కోట్లాది రూపాయలు వితరణగా అందించిన రాని ఆనందం సొంత గ్రామంలోని పాఠశాలలో పలకలు బలపాలు పెన్సిళ్లు పెన్నులు పెన్స్ బాక్స్ తదితరాల అందించిన సమయంలో విద్యార్థిని విద్యార్థుల కళ్ళలో ఆనందాన్ని చూశామన్నారు

## హైబ్రిడ్ మెషిన్ లెర్నింగ్ పరిశోధనలో రొండి పుష్పలత కు "పీహెచ్‌డీ"



**మచిలీపట్నం,జూన్ 18 (వార్తాప్రభ) :** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన పరిశోధనకు గాను రొండి పుష్పలతకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) డిగ్రీ ప్రదానం చేయనున్నట్లు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం నుంచి బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైబ్రిడ్, ట్రాన్స్‌ఫార్మర్ ఆధారిత మెషిన్ లెర్నింగ్ ఆర్కిటెక్చర్లతో మెరుగైన ఉపగ్రహ చిత్ర వర్గీకరణ అనే అంశంపై పుష్పలత సమర్పించిన థీసిస్‌ను పీహెచ్‌డీ వైవా–వోస్ కమిటీ పరిశీలించి ఆమోదించింది. కమిటీ సిఫార్సుల మేరకు వైస్–ఛాన్సలర్ ఆదేశాల ప్రకారం పార్ట్‌టైమ్ పరిశోధక విద్యార్థిని రొండి పుష్పలతను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ డిగ్రీకి అర్హురాలిగా ప్రకటించారు. ఉపగ్రహ చిత్రాల వర్గీకరణలో కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ సాంకేతికతల వినియోగంపై ఆమె చేసిన పరిశోధనకు అంతర్జాతీయ ఆమోదం లభించింది. దీనికి అకాడమిక్ వర్గాల నుంచి ఆమెకు ప్రశంసలు లభిస్తున్నాయి. వీరు కృష్ణా జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సీనియర్ టిడిపి రాష్ట్ర నాయకులు రొండి కృష్ణ యాదవ్ కుమార్తె.

## అక్రమ మద్యం దుకాణాలు నిర్వహించే వ్యక్తులపై కేసు నమోదు



**కంచికచర్ల,జూన్ 18 (వార్తాప్రభ) :** అక్రమ మద్యం దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కంచికచర్ల ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆప్రోస్నీసా బేగం తెలియజేశారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు. కంచికచర్ల ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వీరులపాడు, కంచికచర్ల మండలాల పరిధిలోని గ్రామాలలో అక్రమ మద్యం అమ్మకాలు జరిపే వారిపై( బెల్టు పాపులు)మీద దాడులు గురువారం నిర్వహించారు. ఈ దాడులలో కంచికచర్ల మండలం లోని కీసర, గని ఆత్కూరు గ్రామం, వీరులపాడు మండలంలోని. పొన్నవరం గ్రామంలో మొత్తం ముగ్గురు వ్యక్తులను. అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి మొత్తం 27 మద్యం సీసాలను స్వాధీన పర్చుకుని వారిపై cr.No: 57/26, 58/26, 59/26. క్రింద. కేసులు. నమోదు చేసినట్లు ప్రొఫెషనసిఐ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయాలు, బెల్టు షాపులు నిర్వహిస్తే ఎంతటి ఎవరికైనా సరే కఠిన చర్చలు తప్పవని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆ ప్రపున్నీసా బేగం హెచ్చరించారు. ఈ దాడులలో ఇన్స్పెక్టర్ తో పాటుగా ఎక్సైజ్ సిబ్బంది శ్రీనివాసుబాబు శివరామకృష్ణ , భాస్కర్ పాల్గొన్నారు.

## వీరవరం-రామవరం రహదారి పనులను పరిశీలించిన ఎంపీపీ తోట రవి, తోట గాంధీ



**కిర్లంపూడి,జూన్ 18 (వార్తాప్రభ) :** జగ్గంపేట ఎమ్మెల్యే,టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ,కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కృషితో నిర్మాణంలో ఉన్న వీరవరం–రామవరం రహదారి పనులను ఎంపీపీ తోట రవి,వీరవరం సొసైటీ అధ్యక్షులు తోట గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రహదారి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి,నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా తోట రవి, తోట గాంధీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులు కీలకమని,ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రజలకు అన్ని విధాల సేవలు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాలు–పట్టణాలను అనుసంధానించే రోడ్ల నిర్మాణం ద్వారా ఆర్థిక అభివృద్ధి వేగవంతమవుతుందని, రైతులు, వ్యాపారులు, విద్యార్థులకు ప్రయాణ సౌకర్యాలు మరింత మెరుగవుతాయని వివరించారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటికి తక్షణ పరిష్కారం చూపడం కూటమి ప్రభుత్వ అభివృద్ధి విధానమని వారు స్పష్టం చేశారు.

## గొలుసు దుకాణాల పై ఎక్సైజ్ దాడులు...



**పెనుగంచిప్రోలు,జూన్ 18 (వార్తాప్రభ) :** మండల కేంద్రం అయిన పెనుగంచిప్రోలు లో అక్రమంగా నిర్వహిస్తున్న గొలుసు దుకాణాలపై ఎక్స్ జ్ అధికారులు బుధవారం బుధవారం రాత్రి దారులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న వారి వద్ద నుంచి మద్యం సీసాలు స్వాదినం చేసుకున్నట్లు ఎక్స్ జ్ సి ఐ రమాదేవి తెలిపారు. అక్రమంగా గొలుసు దుకాణాలు నిర్వహించే వారిపై చట్ట పరమై న చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..

## కాకినాడలో అన్న క్యాంటీన్ల పనితీరుపై ప్రత్యేక పర్యవేక్షణ: కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ



**కాకినాడ,జూన్ 18 (వార్తాప్రభ) :** కాకినాడ నగరంలో నిర్వహిస్తున్న ఐదు అన్న క్యాంటీన్ల పనితీరును ప్రతిరోజూ పర్యవేక్షించడం జరుగుతుందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం సంత చెరువు సమీపంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి నిర్వహణను పరిశీలించారు. ఉదయం అల్పాహారం తీసుకోవడానికి వచ్చిన ప్రజలను పలకరించి, వారికి అందుతున్న ఆహారం నాణ్యత, సిబ్బంది వ్యవహారశైలి, క్యాంటీన్‌లోని సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్ సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారా, ఆహారం సమయానికి అందుతున్నదా అనే అంశాలపై కూడా ఆయన ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని అన్న క్యాంటీన్లలో ప్రతిరోజూ నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. . క్యాంటీన్లలో త్రాగునీటి సదుపాయం సక్రమంగా ఉందా, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా నిర్వహిస్తున్నారా అనే అంశాలను నిరంతరం తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్లను నిర్వహిస్తోందని, ఆ లక్ష్యానికి అనుగుణంగా సేవలు అందేలా నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని కమిషనర్ వివరించారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను కూడా వెంటనే పరిష్కరించి సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. కనకారావు, అసిస్టెంట్ ఇంజనీర్ అర్జున్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నీలిపుడి లో ఉపాధ్యాయులు సమిష్టిగా విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ..



**కృత్తివెన్ను,జూన్ 18 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం నీలిపూడి మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుల బృందం అందరూ కలిసి సమిష్టిగా స్కూల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేపట్టారు. గురువారం కృత్తివెన్ను ఎంఈఓ 1 అన్వర్ జానీ,ఎం ఈ ఓ 2 ప్రసాద్ మరియు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ నోట్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అందే సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు గ్రామ పెద్దలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతారని, మన పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలో వేసి బంగారు బాటలు వేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తల్లిదండ్రులను గ్రామ పెద్దలను కోరారు. చాలా పాఠశాలలో ప్రభుత్వం ఇచ్చే పాఠ్యపుస్తకాలు తప్ప నోటి పుస్తకాలు ఇవ్వడం చాలా తక్కువ , ఈ పాఠశాలకు సంబంధించి ఉపాధ్యాయుల సమిష్టి కృషితో వారి సొంత ఖర్చులతో విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ కి శ్రీకారం చుట్టారని, వారి ప్రయత్నానికి ఎంఈఓ లు, గ్రామ పెద్దలు తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను ఎంఈఓ 1 అన్వర్ జానీ, ఎంఈఓ 2 ఎస్ కే డి వి ప్రసాద్, టిడిపి గ్రామ అధ్యక్షుడు పాశం సూర్యచంద్రరావు ( సూరిబాబు ) జనసేన గ్రామ అధ్యక్షుడు పాశం ఆదిశేషారావు, పాఠశాల చైర్మన్ పాశం నాగరాజు ప్రధానోపాధ్యాయులు మహ్మద్ మునవర్, ఉపాధ్యాయినీలు వీర కుమారి, నాగమల్లేశ్వరి, మరియు గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు సస్య రక్షణ పద్ధతులు అవాలంభించాలి



**గుంటూరు,జూన్ 18 (వార్తాప్రభ) :** పత్తి పంటలో గులాబీ రంగు కాయ తులచే పురుగు నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని. ఎంటమాలజిస్ట్ రాజేష్ చౌదరి, సాయిల్ సైన్స్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ సృజిని లు అన్నారు. గురువారం ఫిరంగిపురం లో నిర్వహించిన పాల్గొన్న వారు మాట్లాడుతూ 45 రోజుల పైరు లో లింగాకర్షకు బుట్టలు అమర్చడం పంట మార్పిడి చేయడం పంటను పొడిగించకుండా ఉండడము భూమిని లోతుగా దున్నడము ప్రత్తి తీసివేసిన తర్వాత మో ళ్లను మేకలను వదిలి మేపించడం చివరి దశలో సింథటిక్ పైరిత్రాయిడ్స్ ని స్ప్రే చేయడము లాంటి చర్యలు తీసుకుంటే గులాబీ రంగు కాయ తొలచు పురుగును సమర్థవంతంగా నివారించవచ్చునని తెలిపారు. రసం పీల్చుపురుగు నివారణకు వేప గింజల కషాయం ,ఇమిడా క్లోప్రేడ్ ,ఎసిటామిక్రిడ్ లాంటి మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమం లో గుంటూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎన్ మోహన్ రావు, మండల వ్యవసాయ శాఖ అధికారి,15 గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పంట వేసిన ప్రతి రైతుకు ఏపిఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువులు అందిస్తాం - ఏ డి ఏ మోహన్ రావు





**గుంటూరు,జూన్ 18 (వార్తాప్రభ) :** పంట సాగు చేసిన ప్రతి రైతుకు ఏపిఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువులు అందిస్తామని గుంటూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎన్ మోహన్ రావు అన్నారు గురువారం ఫిరంగిపురం మండలంలోని రైతులకు, వ్యవసాయ సిబ్బందికి ఏపిఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతులకు ఎరువుల పంపిణీ గురించి శిక్షణ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ సమావేశ మందిరము నందు నిర్వహించిన రైతులకు యాప్ ద్వారా వారు వేసిన పంటలకు అనుగుణంగా ఈ సంవత్సరం యూరియా మరియు డిఏపి అందించబడతాయని దీనికి గాను మండల టాస్కోఫోర్స్ గా తహసీల్దార్ ,వ్యవసాయాధికారి ఎంపీడీవో , సబ్ ఇన్స్పెక్టర్ లు బృందం గా ఏర్పడతారని వారు వ్యవసాయ శాఖ ద్వారా ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని సమీక్షిస్తారన్నారు. యూరియా మరియు డిఏపిలు 2025 లో చేసిన పంట నమోదు కార్యక్రమాన్ని ప్రామాణికంగా తీసుకొని ఎరువులు కేటాయించబడతాయని, రైతు లందరు ఈ సంవత్సరము అదే సర్వే నెంబర్లలో వేరే పైరు వేసినట్లయితే గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేసుకోవాలని ఆ పంటలకు అనుగుణంగానే ఎరువులు ఇవ్వబడతాయన్నారు. అలాగే కౌలు రైతులు రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ ద్వారా కవులు రైతు కార్డులను తీసుకొని ఉండాలని వారికి కూడా ఎరువులు కేటాయించబడతాయని , రైతు సోదరులు తమ స్మార్ట్ ఫోన్లను తీసుకొని. పంట నమోదు చేయించుకొని మండలంలో కేటాయించబడిన రైతు సేవా కేంద్రాలు ప్రాథమిక వ్యవసాయ సంఘాలు ప్రైవేటు డీలర్లు జీడీసీఎంఎస్ లాంటి సంస్థల ద్వారా ఎరువులు తీసుకోగలరని అలాగే రైతుల స్మార్ట్ ఫోన్లకు ఓటిపి వస్తుందని దానిని వ్యవసాయ సిబ్బందికి తెలియచేస్తే ఏ పంటకు ఎన్ని ఎన్ని ఎరువులు వస్తాయో అలాగే ఎన్ని దఫాలుగా ఇస్తారో తెలియచేస్తారని తెలిపినారు.రైతులెవరూ కంగారు పడవలసిన అవసరం లేదని దాదాపు 25 వేల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని కాబట్టి రైతులు అర్థం చేసుకొని పంటల వారీగానే ఎరువులు తీసుకోవాలని అలాగే అధిక ఎరువులు వాడని పక్షంలో భూమి ఆరోగ్యం కూడా కాపాడబడుతుందని తెలిపినారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె మయూరి ఆత్మ డిడిఏ తోటకూర శ్రీనివాసరావు తహసీల్దార్ ప్రసాద్ రావు , సిహెచ్ వెంకటేశ్వరరావు వ్యవసాయాధికారి జె వాసంతి,వ్యవసాయ మరియు రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

## మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి త్వరితగతిన స్థలాల ఎంపిక చేపట్టాలి

### –జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్



**అమలాపురం,జూన్ 18 (వార్తాప్రభ) :** అమలాపురం పట్టణంలో సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, నాచురల్ సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణాలకు అత్యంత అనువైన స్థలాలను తక్షణమే ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ రెవెన్యూ, పురపాలక సంఘ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు పురపాలక, రెవెన్యూ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందుపల్లి పరిధిలో సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి, అలాగే సూర్యనగర్ మరియు కిమ్స్ ఆసుపత్రి సమీపంలో నాచురల్ సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు.?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సహజ సిద్ధమైన నీటి ప్రవాహం కలిగి ఉండి పట్టణంలోని మేజర్ మురుగు కాలువలు నేరుగా కనెక్ట్ అయ్యేలా, ఎటువంటి అదనపు పంపింగ్ స్కీములతో అవసరం లేకుండా, సహజ సిద్ధమైన పరివాహక ప్రాంతం గుండా నీరు ప్రవహించేలా అనువైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణంతో పాటుగా ప్లాంట్ల నిర్మాణానికి తదుపరి నిర్వహణకు అవసరమైన పెద్ద మిషనరీ నేరుగా వచ్చేందుకు వీలు గా విశాలమైన అప్రోచ్ రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. సదరు స్థలాలకు ప్రత్యామ్నాయంగా రెవెన్యూ సిబ్బంది భూములను గుర్తించి, అక్కడ ఉన్న 133 కుటుంబాలను సురక్షితంగా తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.? సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన చేస్తూ భూసేకరణ ప్రక్రియలో ఉన్న సాధ్యసాధ్యాలను పరిశీలించడానికి రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా మరోమారు క్షేత్రస్థాయి పర్యటన జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించాలన్నారు. ఎన్ఎస్‌టీపీ నిర్మాణం కొరకు సూర్యనగర్ నందు 9 సెంట్లు, కిమ్స్ వైద్య కళాశాల వద్ద 11 సెంట్లు స్థలాలను కేటాయించాలని ఆదేశించారు.?భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, సదరు భూములను పురపాలక సంఘానికి స్వాధీనం చేస్తే వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.?ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ వైఖోశీ నైదియాదేవి,మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారిణి రాణి సంయుక్త, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్లు సుబ్బరాజు, నాగలక్ష్మమ్మ మరియు పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ జ్ఞానసాయికి విశేషాభిషేకాలు



**గుడ్లవల్లేరు,జూన్ 18 (వార్తాప్రభ) :** మండలంలోని అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో స్వామివారికి గురువారం ఆ మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీకుమారి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయికి వేకువజామునే వేద పండితులు విశేషాభిషేకాలను నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. అంగలూరు శ్రీ షిరిడీ సాయి సేవా సంఘ ఆధ్వర్యాన సాయి భక్తులు స్వామివారి గీతాలాపనలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయ ప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి ఏ మ్యానరేషన్ ఫారం అందజేత..



**కంచికచర్ల,జూన్ 18 (వార్తాప్రభ) :** యస్ ఇ ఆర్, సర్వేలో భాగంగా ఇంటింటికి ఏ మ్యాన రేషన్ ఫారాలు సర్వే నిమిత్తం కంచిక చర్ల పట్టణ పరిధిలోనే జుజ్జూరు నందు యూనిట్ ఇన్చార్జి తోట మల్లికార్జున రావు బి ఎల్ ఓసౌజన్య పాల్గొని బూత్ లో ప్రజలకు ఫారాలు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా యూనిట్ ఇన్చార్జి తోట మల్లికార్జునరావు బి ఎల్ ఓ సౌజన్య లు ప్రజలతో మాట్లాడుతూ 2002 ఓటరు జాబితాలలో మీ పేరు ఉంటే నేరుగా మ్యాపింగ్ చేసుకోవచ్చు పేరు లేకపోతే తల్లిదండ్రులు తాతయ్య అమ్మమ్మ నానమ్మ పేర్లు ఆధారం కూడా మ్యాపింగ్ అవకాశం ఉంది అనిదీనికి ఆధార్ నెంబరు ఇవ్వడం తప్పనిసరి కాదు అనిప్రజలందరికీ ఎస్ ఐ ఆర్ గురించి మరియుఓటర్లకు కీలకమైన సమాచారాలను తెలియజేయడం జరిగినది.

## నీట్ ఎగ్జాంకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

### ఉచిత ప్రయాణానికి అవకాశం

**మచిలీపట్నం,జూన్ 18 (వార్తాప్రభ) :** జూన్ 21వ తేదీన దేశవ్యాప్తంగా జరగబోతున్న నీట్ రీ ఎగ్జామినేషన్ సందర్భంగా పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎగ్జామ్స్ సెంటర్లకు చేరుకునే క్రమంలో ప్రయాణ ఖర్చులతో టెన్షన్ పడుతున్న విద్యార్థులకు ఊరట ఇస్తూ ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీఎస్ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలనుకుంటున్న విద్యార్థులు తమ నీటి హాల్ టికెట్ కండక్టర్కు చూపిస్తే సరిపోతుంది. ఒక్క రూపాయి చార్జీ లేకుండా ఉచితంగా ప్రయాణించవచ్చు. పరీక్షలు జరుగు రోజు విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. రద్దీ ఎక్కువగా ఉండే మార్గాలు గుర్తించి అక్కడ సాధారణ బస్సులతో పాటు అదనంగా ప్రత్యేక బస్సులను నడపనుంది. కృష్ణాజిల్లా లో అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ, గన్నవరం,ఉయ్యూరు డిపోల నుండి పరీక్షా కేంద్రాలకు రోజువారి నిడపబడుతున్న బస్సు సర్వీసులతోపాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే మార్గాలలో తదనుగుణంగా నీట్ పరీక్షకు హాజరయ్య విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు అదనంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి కే వెంకటేశ్వర్లు తెలిపారు. నీట్ రీ ఎగ్జామినేషన్ కు హాజరయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

## నిరుపేదకు నిత్యవసర సరుకులు పంపిణీ



**గుంటూరు,జూన్ 18 (వార్తాప్రభ) :** వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ మరియు శ్రీ కృష్ణ అకాడమీ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ ఆధ్వర్యంలో మల్లికార్జున పేట మూడ వ లైన్ నందు నివసిస్తున్న నిరుపేద రాలైన మేరీ శిరీష కు వారి అవసరార్థం ట్రై సైకిల్, బియ్యం, నిత్యవసర సరుకులు మరియు కూరగాయలను ట్రస్ట్ సభ్యులైన పాశం వెంకటరత్న శోభ మరియు కోనంకి మురళీకృష్ణ యాదవ్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ మేరీ శిరీష కు గత కొన్ని నెలలుగా వారి అవసరార్థం కిరాణా సరుకులు అందజేస్తున్నామన్నారు. వారి అమ్మాయికి చదువు నాకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. నా పరిస్థితిని అర్థం చేసుకొని ప్రతి నెల ఏదో రూపమున సహాయం అందజేస్తున్నందుకు ట్రస్ట్ సభ్యులకు మేరీ శిరీష కృతజ్ఞతలు తెలిపారు.

## హనుమాన్ జంక్షన్ ఎస్ ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్



**హనుమాన్ జంక్షన్,జూన్ 18 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ లో ఎస్ ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సైలెన్సర్ మార్చి అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్ పెట్టి వేగం గా నడిపే అకతాయి లను పట్టుకొని కౌన్సిలింగ్ చేసి మోటారవెహికల్ యాక్ట్ ప్రకారం డేంజరస్ డ్రైవింగ్, వన్ వే డ్రైవింగ్, సౌండ్ పొల్యూషన్ క్రింద ఫైన్ వేసి వెహికల్ సీజ్ చేశారు.. అలాగే వాహనాలు తనిఖీ చేసి లైసెన్స్, హెల్మెట్, ఇతర ధృవ పత్రాలు లేని వారికి చలానా లు విధించారు. అనంతరం వాహనదారులకు చట్టాల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# విద్యార్థుల కలలకు ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్ చిన్న చేయూత.



**హైదరాబాద్, జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ట్రూ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బొప్పాలి వెంకటేష్ చేతుల మీదుగా నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు పి. సాయి చరణ్ (9వ తరగతి) మరియు పి. రక్షిత (8వ తరగతి)లకు విద్యా సామగ్రిగా మొత్తం 50 ప్లెయిన్ నోట్‌బుక్స్ అందజేయడం జరిగింది.ఆర్థిక పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా, చదువుపై ఉన్న వారి ఆశయాలు మాత్రం తగ్గకూడదనే ఉద్దేశ్యంతో ఈ చిన్న సహాయాన్ని అందించామని మారమోని శ్రీ శ్రీశైలం యాదవ్ తెలిపారు. విద్యార్థుల చదువుకు తోడ్పాటుగా అందించిన ఈ నోట్‌బుక్స్ వారి విద్యా ప్రగతికి దోహదపడాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామన్నారు.ఒక విద్యార్థికి అందించిన చిన్న సహాయం, అతని భవిష్యత్తును వెలిగించే పెద్ద దీపంగా మారవచ్చు అన్నారు.సమాజంలో మనం చేసే చిన్న సహాయం కూడా ఎవరో ఒకరి జీవితంలో గొప్ప మార్పుకు నాంది కావచ్చు అన్నారు.. అందుకే ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా అవసరమైన వారికి చేయూతనివ్వాలని శ్రీశైలం యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రూ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మారమోని శ్రీశైలం యాదవ్, జాయింట్ సెక్రెటరీ బైకానీ శ్రీశైలం యాదవ్. పాల్గొన్నారుట్రూ హెల్పింగ్ హాండ్స్ -- సేవే మా లక్ష్యం అని యాదవ్ పేర్కొన్నారు.

# మున్సిపల్ మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ గా జి. శ్రీనివాస్




**శేరిలింగంపల్లి,జూన్ 18 (వార్తాప్రభ):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మియాపూర్ సర్కిల్-48 ఉప కమిషనర్‌గా జి. శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న శశిరేఖ ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో వారి స్థానంలో జి. శ్రీనివాస్‌ను నియమిస్తూ కార్పొరేషన్ కమిషనర్ సృజన ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్న జి. శ్రీనివాస్, గతంలో జీహెచ్‌ఎంసి సంయుక్త కమిషనర్‌గా, అనంతరం మిర్యాలగూడ మున్సిపాలిటీ కమిషనర్‌గా సేవలందించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటైన తర్వాత ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆయన, త్వరలో శశిరేఖ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు.

# ఫెర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా బుకింగ్

**రైతులు ఇంటి వద్ద నుంచే యూరియా బుక్ చేసుకునే సౌకర్యం**

**క్యూ లైన్ లకు స్వస్తి**

**సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా బుకింగ్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, రైతులు యూరియా కోసం క్యూ లైన్ లో నిలబడాల్సిన అవసరం లేకుండా యూరియా పంపిణీ మరింత పారదర్శకంగా సులభంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫెర్టిలైజర్ యాప్ ను అమలు చేసిందని ఒక ప్రకటనలో తెలిపిన ఏ ఓ జి, నర్మదా అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా రైతులు ఇంటి వద్దనే కూర్చుని తమ పంట సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియాను బుక్ చేసుకునే అవకాశం కల్పించబడింది. యాప్ ద్వారా రైతులు తమ దగ్గరలోని సహకార సంఘాలు ప్రవేట్ డీలర్లు ఎంపిక చేసిన రైతు వేదికలలో అందుబాటులో ఉన్న యూరియాను బుక్ చేసుకోవచ్చు అని అన్నారు. రైతులు మొదటిగా తమ స్మార్ట్ ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఫెర్టిలైజర్ యాప్ ని డౌన్లోడ్ చేసుకొని తమ పట్టాదార్ పాస్ బుక్ కి లింకు అయి ఉన్న ఫోన్ నెంబర్ తో రిజిస్టర్ చేసుకోవాలని తర్వాత తను సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేసుకొని యూరియాని బుక్ చేసుకోవాలని అన్నారు. ఒకవేళ యాప్ లో రైతు యొక్క ఫోన్ నెంబర్ నమోదు కాకపోతే తమ దగ్గరలోని ఏఈఓని సంప్రదించి ఫోన్ నెంబర్ నమోదు చేసుకోగలరని మన మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో యూరియా అందుబాటులో ఉందని తెలియజేశారు.

# 53వ వార్డులో "అమ్మ మాట - అంగన్వాడీ బడిబాట!!

● అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు ఘనంగా నిర్వహణ ● నూతన యూనిఫామ్‌లు పంపిణీ చేసిన కార్పొరేటర్ గట్ల రమేష్ ● తల్లిదండ్రులు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని పిలుపు

**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 18 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నగరపాలక సంస్థ 53వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో గురువారం "అమ్మ మాట - అంగన్వాడీ బడిబాట" కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీలో నూతనంగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. 53వ డివిజన్ కార్పొరేటర్ గట్ల రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, తన చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు పునాది వంటివని, ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలతో పాటు, ప్రభుత్వం నూతనంగా అందించిన యూనిఫామ్‌లను కూడా కార్పొరేటర్ గట్ల రమేష్ చిన్నారులకు అందజేశారు. కొత్త యూనిఫామ్‌లు అందుకున్న పిల్లల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుతారి లక్ష్మణ్ బాబు, కడారి నారాయణ, పులి రమేష్, దాసరి ఉషాలు, అడప కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు,



తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేశారు.

# సింగరేణి కార్మికుల సమస్యలపై కవిత గళం!!

● రామగుండం ఓసిపి-3 వద్ద గేట్ మీటింగ్ ● వేతనాలు, ఉద్యోగ భద్రత, వైద్య సౌకర్యాలపై డిమాండ్ ● సింగరేణి కార్మికులకు అండగా ● తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కవిత



**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 18 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణి కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన చీఫ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గళమెత్తారు. "సింగరేణి బాయిబాట" కార్యక్రమంలో భాగంగా గురువారం రామగుండం ఓసిపి-3 వద్ద జరిగిన గేట్ మీటింగ్లో ఆమె పాల్గొని కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమం, సింగరేణి సంస్థ భవిష్యత్తుపై ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు.

**కార్మికుల సమస్యలపై కవిత ప్రసంగం** టిఆర్ఎస్ చీఫ్ కవిత తన ప్రసంగంలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. వేతన సవరణలు, ఉద్యోగ భద్రత, కార్మికుల పిల్లలకు ఉద్యోగావకాశాలు, వైద్య సౌకర్యాలు వంటి అంశాలపై ఆమె మాట్లాడారు. సింగరేణి కార్మికులు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం లభించాలని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచనలను విరమించుకోవాలని, కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని ఆమె డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ ఎల్లప్పుడూ సింగరేణి కార్మికులకు అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

**సింగరేణి బాయిబాట లక్ష్యం** "సింగరేణి బాయిబాట" కార్యక్రమం ద్వారా సింగరేణిలోని అన్ని గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులను సందర్శించి కార్మికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చించడం పార్టీ లక్ష్యంగా




పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కార్మికులలో ఆత్మవిశ్వాసం నింపి, వారి హక్కుల కోసం పోరాడే స్ఫూర్తిని రగిలించాలని ఆమె ఆశిస్తున్నారు. ఈ గేట్ మీటింగ్ సింగరేణి కార్మికులలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, వారి సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ గేట్ మీటింగ్ లో హెచ్ఎంఎస్ నాయకులు రియాజ్ అహ్మద్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మనోజా గౌడ్ తో పాటు పలువురు కార్మిక సంఘాల ప్రతినిధులు, టీఆర్ఎస్ నాయకులు, పెద్ద సంఖ్యలో సింగరేణి కార్మికులు పాల్గొన్నారు. రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, కవిత నాయకత్వంలో పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. మనోజా గౌడ్ మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం టీఆర్ఎస్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. కవిత నాయకత్వంలో అన్ని వర్గాల వారికి సమ న్యాయం జరుగుతుందని జోస్యం చెప్పారు.

# ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంచుతాయి

● శివ పంచాయతన నవగ్రహ విగ్రహ ప్రతిష్టాప మహోత్సవములో మాజీ కార్పొరేటర్ రాగం నాగేంద్ర యాదవ్.


● ఆత్మీయ అతిథి గా పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**శేరిలింగంపల్లి,జూన్ 18 (వార్తాప్రభ):**పటాన్ చెరువు నియోజకవర్గం లోని తెల్లాపూర్ విలేజ్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో నిర్వహించిన శివపంచాయతన సహిత నవగ్రహ ప్రతిష్టా మహోత్సవం వైభవంగా జరిగింది.తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరు భరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి శివపంచాయతన మూర్తులు, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు .మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని,సద్భావనను పెంపొందిస్తాయని అన్నారు. ఆలయ నిర్మాణం, ప్రతిష్టా మహోత్సవం విజయవంతం కావడానికి కృషి చేసిన కొల్లూరు సత్తయ్యను అభినందించారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ ఛైర్మన్ కొల్లూరు సత్తయ్య, మాజీ కౌన్సిలర్ కొల్లూరు భరత్, పెరుగు ఐలేష్ యాదవ్, సీపీ రెడ్డి, మాజీ ఆయాకట్టు ఛైర్మన్ నర్సింలు, కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ బుచ్చి రెడ్డి, కొల్లూరు శ్రీను, పద్మారావు, రవీంద్ర చారి, రాగం దేవేందర్ యాదవ్, శ్రీపాల్ రెడ్డి, మెట్టు కళ్యాణ్ యాదవ్, అఫ్జల్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో నేరాలను అదుపు చేయడంలో కమిషనర్ సుమతి కృషి ప్రశంసనీయం.


**మర్యాదపూర్వకంగా సిపిని కలిసిన మునిగాల నరసయ్య.**



**జవహర్ నగర్ జూన్ 18: (వార్తా ప్రభ)**శాంతి భద్రతల పరిరక్షణలో నేరాలను అదుపు చేయడంలో పోకిరిలను అరికట్టడంలో సిపి బాడుగుల సుమతి కృషి ప్రశంసనీయమని కేసీఆర్ కూరగాయల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునిగాల నరసింహ పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ ప్రగతి నగర్ కు చెందిన కెసిఆర్ కూరగాయల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునగాల (కూరగాయల నరసింహ) నరసింహ తదితరులు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జవహర్ నగర్ లో పోకిరిల ఆగడాలు వంటి సమస్యలపై సిపి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన సిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. పర్యావరణ పరిరక్షనే ధ్యేయంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయోత్సవ సభ విజయవంతం చేయాలి

**నేతలకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్**



**కైకలూరు, జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ హామీల కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు డా. కామినేని శ్రీనివాస్ గురువారం కైకలూరు మండలంలోని ప్రయాణికుల విశ్రాంతి భవనంలో కూటమి నాయకులతో సమావేశమై ఈ నెల 19వ తేదీన (శుక్రవారం) సాయంత్రం జరగనున్న "కూటమి ప్రభుత్వం -- రెండేళ్ల పాలన విజయోత్సవ సభ" ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, ప్రజల భాగస్వామ్యం, నాయకులు మరియు కార్యకర్తల బాధ్యతలపై చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే వేదికగా ఈ సభ నిలవాలని ఆయన సూచించారు.అనంతరం సభా ప్రాంగణాన్ని పరిశీలించిన డా. కామినేని శ్రీనివాస్, ఏర్పాట్లపై అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యుడు కమ్మిలి విఠల్‌రావు, ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

హైదరాబాద్

# ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేద్దాం.

**- అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ఎమ్మెల్యే గాంధీ సమీక్ష**





**శేరిలింగంపల్లి,జూన్ 18 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు,చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జలమండలి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రజల నుంచి వచ్చిన వినతులపై వెంటనే స్పందించి,వర్షాకాలంలో తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి, కొత్త మురుగునీటి మరియు తాగునీటి పైపుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు .అనంతరం కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతాన్ని పురపాలక సంస్థ కమిషనర్ సృజన,ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు.రహదారి విస్తరణ, భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేసి ట్రాఫిక్ రద్దీని తగ్గించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి,ట్రాఫిక్ రహిత ప్రయాణానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆరెకపూడి గాంధీ తెలిపారు.వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఎమ్మెన్నార్ ఇండో ఇంగ్లీష్ స్కూల్.

**-విద్యాశాఖ అధికారులకు ఏఐఎస్టీఎస్ అధ్యకులు పల్లె మురళి ఫిర్యాదు**





**శేరిలింగంపల్లి,జూన్ 18 (వార్తాప్రభ):**మియాపూర్ స్వర్ణపురిలోని ఎమ్మెన్నార్ ఇండో ఇంగ్లీష్ స్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తోందని ఆరోపిస్తూ ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి ఆధ్వర్యంలో తల్లిదండ్రులు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.ఫీజుల పేరుతో అదనపు భారం మోపడంతో పాటు యూనిఫాంలు,పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పాఠశాలలోనే అధిక ధరలకు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఫీజులు చెల్లించని విద్యార్థులను అవమానించడం, పరీక్షలకు అనుమతించబోమని హెచ్చరించడం వంటి అంశాలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు,సహాయ సంచాలకుడు పూర్ణచంద్రరావు ఫిర్యాదుపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్డీఎస్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతులే లక్ష్యం

**-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.**

**శంకరపట్నం జూన్ 18 (వార్తాప్రభ)** గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడితేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ అన్నారు.గురువారం శంకరపట్నం మండలం ధర్మారంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో రూ.41 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ చింతరెడ్డి పద్మతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.

# సంపాదకీయం

## జగన్ ఆరాటం... నాయకుల పోరాటం ?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ అయితే తెగ ఆరాటపడుతున్నారు. ఆయన గత కొంతకాలంగా చెబుతూ వస్తున్నారు సర్ ప్రక్రియ విషయంలో జాగ్రత్తగా ఉండాలని. సర్ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లను తొలగిస్తారు అని అంటున్నారు. నియోజకవర్గానికి అయిదు వేల ఓట్లు అలాగే బూత్ లెవెల్ లో యాభై ఓట్లు వైసీపీని టార్గెట్ చేసుకున్నారు అని కూడా ఆయన అంటున్నారు. ఈ విషయంలో అధికారంలో కూటమి ప్రభుత్వం ఉంది కాబట్టి పూర్తి అప్రమత్తంగా ఉండాలని జగన్ కోరుతున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం కో ఆర్డినేటర్లు తమ బాధ్యతగా సర్ ప్రక్రియని మోనిటరింగ్ చేయాలని జగన్ కోరుతున్నారు. లేకపోతే తీవ్ర స్థాయిలో నష్టపోతామని కూడా జగన్ స్పష్టంగా చెబుతున్నారు. తాజాగా జగన్ మరో మారు ఇదే తరహా హెచ్చరికలను పార్టీ నేతలకు జారీ చేశారు. ఒక్క ఓటు సర్ ప్రక్రియలో తొలగించినా తిరిగి ఆ ఓటుని చేర్చడం బహు కష్టమని సీనియర్ నాయకుల భేటీలో జగన్ పేర్కొన్నారు. సర్ ప్రక్రియని అంతా అర్థం చేసుకోవాలని జగన్ సూచించారు.ఏపీలో సర్ ప్రక్రియ మొదలైపోయింది. జూన్ 15 నుంచి జూలై 15 వరకూ నెల రోజుల పాటు సర్ ప్రక్రియ సాగుతుంది. ఆ తరువాత ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. అయితే ముసాయిదాలో తప్పు ఒప్పులు చూసుకుని పోయిన ఓట్లను చేర్పించడం కష్టమవుతుందని అంటున్నారు. అది ఒక పెద్ద ప్రహ్సనం. అంతే కాదు అతి పెద్ద తతంగంగా ఉంటుందని అంటున్నారు. అందువల్ల ఈ నాలుగు వారాలే కీలకమని జగన్ పదే పదే చెబుతున్నారు. ప్రతీ ఒక్క బూత్ లెవెల్ ఏజెంట్ కూడా కష్టపడాలని వారి వెంట నియోజకవర్గం ఇంచార్జి తప్పనిసరిగా ఉండాలని కూడా జగన్ సూచిస్తున్నారు. బాబుతో జాగ్రత్త ఇక ఏపీలో చంద్రబాబుతో జాగ్రత్త అని కూడా జగన్ అంటున్నారు. బాబు వ్యూహాలలో ఆరితేరిన వారు అని అందువల్ల వైసీపీ ఓట్లు గల్లంతు కాకుండా కంటికి రెప్పలా కాచుకోవాల్సిన అవసరం ఉందని జగన్ అంటున్నారు. ఇక వైసీపీ ఓట్లను పెద్ద ఎత్తున తీసేయడానికి కూటమి కుట్ర చేస్తోంది అని కూడా జగన్ ఆరోపిస్తున్నారు. గ్రౌండ్ లెవెల్ లోకి వైసీపీ యంత్రాంగం మొత్తం దిగితేనే తప్ప సర్ లో వైసీపీ ఓట్ల గల్లంతుని అడ్డుకోలేమని జగన్ గట్టిగా చెబుతున్నారు. నిరంతరం సమీక్షలు కూడా చేయాలని జగన్ కోరుతున్నారు. అయితే జగన్ ఆరాటం చాలానే ఉంది కానీ నాయకుల పోరాటం ఆ లెవెల్ లో ఉందా అన్న చర్చ సాగుతోంది. వైసీపీ ఓట్లను రక్షించుకోవాలని జగన్ ఎంత చెబుతున్నా గ్రౌండ్ లెవెల్ కి వచ్చేసరికి ఆ సీరియస్ నెస్ ఎంత అన్న చర్చ కూడా పార్టీలో సాగుతోంది. పార్టీలో ఇంకా యాక్టివ్ నెస్ రాకపోవడం ఒక కారణం అయితే ఇంత చేసినా రేపటి ఎన్నికల్లో తమకు టికెట్ దక్కుతుందా లేదా అన్న డౌట్ కూడా నేతలకు ఉందని అంటున్నారు. మరో వైపు క్యాడర్ లో ఇంకా నిరాశ పోలేదని అంటున్నారు. ఈ రెండేళ్లలో క్యాడర్ ని దగ్గర తీసి కనీసం సమీక్షలు అయినా నిర్వహించకపోవడం వల్లనే ఆ ప్రభావం ఇపుడు పడుతోందా అన్న చర్చ సాగుతోంది. మొత్తానికి చూస్తే అవతల టీడీపీ పూర్తి జోష్ లో ఉంది. ప్రతీ ఓటూ మనదే కావాలని పట్టుదలగా ఉంది. వైసీపీ కూడా పందెం కోడిలా తలపడినపుడే సర్ ప్రక్రియలో ఓట్లు గల్లంతు కావు. మరి రెండు రోజులుగా సర్ సాగుతోంది. వైసీపీ హడావుడి అయితే ఇంకా మొదలు కాలేదనే అంటున్నారు. చూడాలి మరి పార్టీ నేతలు ఏ రకంగా రంగంలోకి దిగుతారో.

## మార్ఫింగ్ ఫోటోలతో అంబటి రాంబాబు శవ రాజకీయం

**జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్**



**విజయవాడ పశ్చిమ, జూన్ 18: (వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన కృష్ణలంకకు చెందిన రౌడీషీటర్ గాదే సాయి కృష్ణ కేసును వైయస్సార్సీపి నేత మాజీ మంత్రి అంబటి రాంబాబు మార్ఫింగ్ ఫోటోలతో తప్పు దోవ పట్టిస్తున్నారని సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ మండిపడ్డారు. భవానిపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాడిత శంకర్ మాట్లాడుతూ రౌడీ షీటర్ గాదే సాయి కృష్ణ కేసును రాజకీయ అంశంగా మార్చి రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించాలని వైయస్సార్ సిపి నేతలు పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు. కృష్ణలంకకు చెందిన గాదే సాయి కృష్ణ పై సుమారు 21 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదు అయ్యాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగాన్ని గాదే సాయి కృష్ణ కేసు పై సమగ్ర విచారణ కాదేశించిందని పేర్కొన్నారు. అయితే రాష్ట్రంలో కుల శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచిన వైఎస్ఆర్సిపి గాదే సాయికృష్ణ కేసుని కుల రాజకీయం చేస్తుందన్నారు. రౌడీ షీటర్ సాయి కృష్ణ చేతిలో హత్యకు గురైన నవీన్ రెడ్డి ఫోటోలను మీడియా ముందు ప్రదర్శిస్తూ ఆ ఫేక్ ఫోటోలతో సాయి కృష్ణ ఫోటోలు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ అంశాన్నైనా వివాదాస్పదంగా మార్చి దానిని జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వైఫల్యంగా ప్రచారం చేయడం వైసీపీ నేతలకు పరిపాటిగా మారింది అన్నారు. ఇటీవల తెలంగాణ కు చెందిన నిరంజన్ అనే బాలుడని పరమార్శిస్తే దానిని సైతం రాజకీయ రొచ్చులోకి లాగటం జగన్ అండ్ కో కి చెల్లుబాటు అయింది అన్నారు. గాదే సాయి కృష్ణ కేసులో నిజా నిజాలు బహిర్గతం కావాలని పవన్ కళ్యాణ్ డిజిపిని కోరడం జరిగిందని గుర్తు చేశారు. గాదే సాయి కృష్ణ కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ నేతలు అండగా నిలిచారని స్పష్టం చేశారు. ఫేక్ ఫోటోలతో దుష్ప్రచారానికి పాల్పడుతున్న అంబటి రాంబాబు పై సుమోటోగా కేసు స్వీకరించాలని డిజిపిని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు బాడిత శంకర్ చెప్పారు. ఈ సమావేశంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నార్ను.

## సుపరిపాలన విజయోత్సవ సభ ఏర్పాట్లు ను పరిశీలించిన ఎమ్మెల్యే

**అనంతపురం జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అనంతపురం జిల్లా కేంద్రంలో జూన్ 19న నిర్వహించనున్న కూటమి ప్రభుత్వం రెండేళ్ల సుపరిపాలన విజయోత్సవ సభ సందర్భంగా కక్కలపల్లి క్రాస్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి ఫంక్షన్ వద్ద ఏర్పాటు చేస్తున్న సభా వేదిక, ఏర్పాట్లను ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు పరిశీలించారు. ఆయనతో పాటు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చల్లా వారి వీధిలో రోడ్డు, సైడ్ డ్రైన్లు,వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

**అధికారులకు చల్లా వారి వీధి నివాసితుల వినతి**




**విజయవాడ పశ్చిమ జూన్ 18: (వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనిస్థానిక భవానిపురం 45 డివిజన్లోని చల్లా వారి వీధిలో 200 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఈ వీధిలో రోడ్డు, సైడ్ డ్రైన్లు, వీధిలైట్లు ప్రజల సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులకు చల్లా వారి వీధి నివాసితులు విజ్ఞప్తి చేశారు. గురువారం చల్లా వారి వీధిలో నివసిస్తున్న స్థానికులు సయ్యద్ హుస్సేన్, బీరం శ్రీనివాసరావు, నరేష్ నారాయణ, డి. బాబూరావు, రామచంద్ర రావు, సునీత తదితరులు మీడియాతో మాట్లాడుతూ చల్లా వారి వీధి రోడ్డు మొత్తం గతుకుల మయంగా మారిందని, చిన్నపాటి వర్షానికి బురదమయంగా తయారవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డంతా గతుకుల మయంగా మారిపోయిందని, ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు.అలాగే రోడ్డు మధ్యలో వేసిన డ్రైనేజీ మ్యాన్ హోల్ మూతలు రోడ్డు మధ్యలో అడుగు ఎత్తుగా ఉండటంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే సరైన రోడ్డు లేకపోవడంతో గోతుల్లో పడి ప్రమాదాలకు గురి అవుతున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట వీధిలైట్లు లేకపోవడంతో విషసర్పాలు తిరుగుతున్నాయని, దీంతో బిక్కుబిక్కుమంటూ రాత్రి ప్రయాణం చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చల్లావారి వీధి రోడ్డు విషయమై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అలాగే పశ్చిమ శాసనసభ్యులు వై.సుజనా చౌదరి తక్షణ చర్యలు తీసుకొని తమను ఇబ్బందుల నుండి గట్టెక్కించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఓటర్లకు అవగాహన కల్పించిన మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు




**విజయవాడ పశ్చిమ జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక పశ్చిమ లోని 54 మరియు 55వ డివిజన్లలోని 199, 208, 204, 209, 216వ పోలింగ్ బూతుల పరిధిలో గురువారం నాడు మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌ఛార్జ్ వెల్లంపల్లి శ్రీనివాసరావు సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకుని, ఓటర్ల జాబితా సవరణ మరియు సర్వే ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించారు.?పర్యటనలో భాగంగా వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఓటర్లందరూ తమ ఓటు హక్కును భద్రపరుచుకోవడానికి మరియు సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇందుకోసం ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫామ్‌కు సంబంధించిన అన్ని రకాల అవసరమైన ధృవీకరణ పత్రాలను, అలాగే పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. బూత్ లెవెల్ ఆఫీసర్ (బి ఎల్ ఓ) ఇంటికి వచ్చినప్పుడు ఎన్యూమరేషన్ ఫామ్‌ను పూర్తి చేసి, దానికి అవసరమైన పత్రాలను, ఫోటోలను జతపరిచి వారికి అందజేయాలని ఆయన ఓటర్లకు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా బూత్ బి ఎల్ ఎ లు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు సత్కారం





**విజయవాడ పశ్చిమ జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ కార్పోరేషన్ ఉన్నత పాఠశాలల్లో గత విద్యాసంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ కనపరచి అత్యుత్తమ మార్కులతో పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన ప్రతి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గురువారం ఉదయం పాతబస్తీలోని గాంధీజీ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో హరివిల్లు ఫౌండేషన్ వారు అభినందన సభను ఏర్పాటు చేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారి సోమశేఖర్ మాట్లాడుతూ గత కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో మార్పులు వచ్చాయని, ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావిధానం రూపుదిద్దుకుందని అందుకు ఉదాహరణ ఇటీవలే వచ్చిన పదవ తరగతి పరీక్షల ఫలితాలని,ప్రతి కార్పొరేషన్ ఉన్నత పాఠశాలల్లో ఈ సంవత్సరం ఉత్తేర్ణతా శాతం పెరిగిందని అందులోనూ ఎక్కువ మంది విద్యార్థులు తొంబయ్ శాతం పైబడి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని వారిలో కొంతమంది ట్రిపుల్ ఐటీ కాలేజీలలో ప్రవేశాలకు ఎంపికయ్యారన్నారు. ఇటువంటి సమయంలో విజయవాడలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హరివిల్లు ఫౌండేషన్ వారు పశ్చిమ నియోజక వర్గ పరిధిలోని మున్సిపల్ కార్పోరేషన్ ఉన్నత పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులను అభినందిస్తూ వారికి సన్మానం చేయటమేకాక ఆ విద్యార్థుల తల్లితండ్రులను, వారి పాఠశాల ప్రధానోపాధ్యాయులను కూడా సన్మానించడం హర్షించదగ్గ విషయమని తెలియచేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.శశికాంత్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా విద్య, వైద్యం మరియు వివిధ రకాల సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తున్న తమ హరివిల్లు ఫౌండేషన్ ఇకపై పేద, మధ్యతరగతి పిల్లలు ఎక్కువగా చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గురువారం పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థినీ విద్యార్థులను సన్మానించామని ఇలా చేయడంవల్ల వారిని ప్రోత్సహించడమే కాక ఇప్పుడు పదవ తరగతి చదువుతున్న వారికి స్ఫూర్తిగా కూడా ఉంటుందని ముందు ముందు తమ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి తోడ్పాటుగా తమ ఫౌండేషన్ ద్వారా సహకారం అందజేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. సన్మానం స్వీకరించిన వారిలో గాంధీజీ నగరపాలకసంస్థ ప్రధానోపాధ్యాయులు కె. మల్లిఖార్జునరెడ్డి మరియు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వివిధ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధానకార్యదర్శి అయిన డా.శరత్ కుమార్, ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీదేవి, బాల సూయనారాయణ, యు.కనకారావు, జి.ఎన్.బి. అప్పలరాజు,చంద్ర శేఖర్ బాబు, బి.మణికంఠ మరియు పాఠశాల పూర్వవిద్యార్థుల శ్యామ్ సుందర్,అడ్వొకేట్ శ్రీధర్, ఎ.జి.మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ -2026లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ వేగవంతం

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ చేపట్టబడుతున్న ఓటర్ల జాబితా కార్యక్రమంలో భాగంగా, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 79-విజయవాడ పశ్చిమ, 80-విజయవాడ సెంట్రల్ మరియు 81-విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోందని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ మరియు సెంట్రల్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ధ్యానచంద్ర, తెలిపారు. 18-06-2026, గురువారం సాయంత్రం 4.00 గంటల వరకు నమోదైన పురోగతి వివరాల ప్రకారం

**79-విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం:**మొత్తం 2,56,666 మంది ఓటర్లకు గాను 29,328 ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 8.75 శాతం పంపిణీ పూర్తయింది. ఇప్పటి వరకు 218 ఫారాలు డిజిటైజేషన్ చేయబడగా, డిజిటైజేషన్ శాతం 0.17గా నమోదైంది.

**80-విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గం:** మొత్తం 2,77,822 మంది ఓటర్లకు గాను 41,180 ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 14.82 శాతం పంపిణీ పూర్తయింది. ఇప్పటి వరకు 684 ఫారాలు డిజిటైజేషన్ చేయబడగా, డిజిటైజేషన్ శాతం 0.25గా నమోదైంది.

**81-విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం:** మొత్తం 2,69,734 మంది ఓటర్లకు గాను 31,804 ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 11.79 శాతం పంపిణీ పూర్తయింది. ఇప్పటి వరకు 611 ఫారాలు డిజిటైజేషన్ చేయబడగా, డిజిటైజేషన్ శాతం 0.23గా నమోదైంది.మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 8,04,222 మంది ఓటర్లకు గాను 1,02,312 ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, సగటున 12.72 శాతం పంపిణీ పూర్తయింది. అలాగే మొత్తం 1,513 ఫారాలు డిజిటైజేషన్ చేశారని కమిషనర్ తెలిపారు.ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రతి అర్హత గల ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందజేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని, పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు , సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు సూపర్వైజర్లు మరియు బూత్ స్థాయి అధికారులకు (బి ఎల్ ఓలు) ఆదేశాలు జారీ చేసినట్లు కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.ప్రజలు బూత్ స్థాయి అధికారులకు సహకరించి, ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో పూర్తి చేసి అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# యుగయుగాల మన హిందూ ధర్మం

**జిల్లా సంస్కృతి ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ**



**చెరుకుపల్లి మండలం జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ ధార్మిక సమితి సమావేశం కొల్లగాని వారి పాలెం అమ్మవారి దేవాలయంలో సత్సంగం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ యుగయుగాల చరిత్ర కలిగిన మన హిందూ ధర్మం సనాతనమైనదని నిత్య నూతనమైనదని అలాంటి హిందూ ధర్మాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన ధర్మం యొక్క గొప్పతనాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలి అన్నరు.ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ కుప్పల వెంకటాద్రి, దాది పెద్దన్న, కొండపల్లి వెంకటేశ్వరరావు మొగదారి పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

## మైలవరపు ఆదినారాయణ, కనకరత్నం వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో దుప్పట్లు, టవల్స్, ఫ్రూట్స్ పంపిణీ



**విజయవాడ పశ్చిమ. జూన్ 18:(వార్తా ప్రభ ప్రతినిధి)** స్వర్గీయ మైలవరపు ఆదినారాయణ, కనకరత్నం దంపతుల 16వ వర్ధంతి సందర్భంగా మైలవరపు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం భవానిపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ లోని శ్రీ వెంకట సాయి శ్రీ వృద్ధాశ్రమ సేవా సంఘం లోని వృద్ధులకు దుప్పట్లు, టవల్స్, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. అలాగే వృద్ధాశ్రమానికి అవసరమైన మిక్సీని కూడా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మైలవరపు ఆదినారాయణ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు ఆదినారాయణ కనకరత్నం వర్ధంతి సందర్భంగా వృద్ధులకు సేవలు అందజేసినట్లు చెప్పారు. తమ తల్లిదండ్రులు కష్టజీవులని వారి ఆదర్శాలను ఆదర్శంగా తీసుకుని తాము పనిచేస్తున్నట్లు వారు చెప్పారు. సామాజిక సేవలో తమ కుటుంబం ఎల్లవేళలా ముందుంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య, మహదేవు అప్పాజీ రావు, గుడివాడ రాఘవ నరేంద్ర, బుల్లా విజయ్ కుమార్, స్వర్గీయ ఆదినారాయణ కుటుంబ సభ్యులు మైలవరపు కొండలరావు,మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గారావు, మైలవరపు త్రివేణి ఇంకా పలువురు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలు

- గుంటుపల్లి డాన్‌బోస్కో స్కూల్ వేదికగా నిర్వహణ
- ఆరోగ్యం, క్రమశిక్షణ, ఏకాగ్రతకు యోగానే మార్గమని చాటిన పోటీలు
- రాష్ట్రస్థాయి అధికారులతో పాటు పాల్గొన్న కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**ఇబ్రహీంపట్నం, జూన్ 18(వార్తా ప్రభ ప్రతినిధి):** యోగాంధ్ర -2026లో భాగంగా రాష్ట్రస్థాయి యోగా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయని.. ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దాదాపు 800 మంది పాల్గొంటున్నారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు .గురువారం ఇబ్రహీంపట్నం




మండలం, గుంటుపల్లి డాన్‌బోస్కో స్కూల్లో రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారి డా. సుజాత, పోటీల రాష్ట్ర నోడల్ అధికారి డా. ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పోటీల తీరుతెన్నులను పరిశీలించారు. పోటీల్లో పాల్గొన్న వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈ పోటీలు యోగాంధ్ర-ఆంధ్రాస్ గ్లోబల్ యోగా షోకేజ్ థీమ్‌తో జరుగుతున్నాయన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని వివరించారు. వ్యక్తిగత కేటగిరీ, గ్రూపు కేటగిరీలో పోటీలు జరుగుతున్నాయని.. వ్యక్తిగత కేటగిరీలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం ప్రదర్శనలు, గ్రూపు కేటగిరీలో సింక్రనైజ్డ్ గ్రూపుయోగా ఉన్నాయన్నారు. యోగా సాంగ్, యోగా క్విజ్, యోగా స్లోగన్, యోగా ఎస్సే పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్, యంగ్, సీనియర్ గ్రూప్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు గేదె గొర్రెలు మృతి

**అనుమసముద్రంపేట జూన్ 18 (వార్తాప్రభ)** ఏ ఎస్ పేట మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షంతో మండలంలోని చిన్నఅబ్బీపురం గ్రామంలో పడిన పిడుగుపాటుకు మబ్బు మస్తానయ్య కు చెందిన గేదె మృతి చెందినట్లు తెలిపారు.సుమారు లక్ష రూపాయలు విలువ చేసే నిండు చూడు గేదె మరణించనది ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకుగ్రామ రెవిన్యూ అధికారులు మరియు పశు వైద్యులు ఆర్ హరీన్ సచివాలయ సిబ్బంది



పరిశీలించి వివరాలను నమోదు చేశారు.



# తోపుడుబండ్లు కార్మికులకు శాశ్వత ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేయాలి

**సిఐటియు కార్యదర్శి యం మహేష్**



**ఇబ్రహీంపట్నం, జూన్ 18 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో తోపుడుబండ్లు కార్మికులకు శాశ్వత ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేయాలని సిఐటియు కార్యదర్శి యం మహేష్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో మే రెండో తారీఖున ప్రమాదాలు జరుగుతున్నాయని పేరుతో రింగ్ సెంటర్ లో ఉన్న తోపుడుబండ్లు కార్మికుల్ని ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా మున్సిపల్ అధికారులు పోలీసులు మూకుమ్మడిగా కార్మికులను ఖాళీ చేయించారని , మున్సిపల్ చైర్మన్ మూడు రోజుల్లో రోడ్డు విస్తరణ పనులు అయిపోతాయని కార్మికుల్ని నమ్మ పలికించి రోడ్డు పాలు చేశారని ఆరోపించారు తక్షణమే మైలవరం ఎమ్మెల్యే వసంత స్పందించి మున్సిపల్ అధికారులు పోలీసు అధికారులతో సమన్వయం చేసి తోపుడుబండ్లు కార్మికులకు శాశ్వత ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటుకు చొరవ చూపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు లేనిపక్షంలో మున్సిపల్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. తోపుడుబండ్లు కార్మికులు గత 40 సంవత్సరాలుగా రోడ్డునే నమ్ముకుని బతుకుతున్నారని మహిళలు ఒంటరి మహిళలు చదువుకున్న యువత స్వయం పోషకంగా జీవించేందుకు తోపుడు బండ్లు కార్మికులు తన కాళ్ళ మీద నిలబడుతున్నారని అలాంటి వారికి ప్రభుత్వం ధైర్యం ఇవ్వాల్సింది పోయి తొలగించడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎ విఠల్ రావు, తోపుడు బండ్లు కార్మిక యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ జి రమణమ్మ కోశాధికారి యు నవీన్ ఉపాధ్యక్షులు అంజలి కమిటీ సభ్యులు కృష్ణ, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## ఎసెన్షియల్ ఆఫ్ పీరియోడాంటాలజీ పుస్తకం ఆవిష్కరించిన షాదిల్ రసూల్ ఖాన్



**ఇబ్రహీంపట్నం, జూన్ 18(వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రతిభ కనబరిచే విద్యార్థులకు,సిబ్బందికి నిమ్రా విద్యాసంస్థల నుండి ఎల్లప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు నిమ్రా విద్యాసంస్థల వైస్ చైర్మన్ షాదిల్ రసూల్ ఖాన్. నిమ్రా దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాహిత్య రెడ్డి రచించిన ఎసెన్షియల్ ఆఫ్ పీరియోడాంటాలజీ పుస్తకాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. పుస్తకం రచించిన సాహిత్య రెడ్డిని అభినందించారు. ప్రతిభ కు హద్దు ఉండకూడదని నిరంతరం విద్య, వైద్యరంగంలో కొత్తదనం ఆవిష్కరిస్తూ ఉండాలని... అలాంటి వారికి విద్యాసంస్థల నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సాహిత్య మాట్లాడుతూ పీరియోడాంటాలజీ అనేది దంతాల చిగుళ్లు, వాటి ఆరోగ్యం, చిగుళ్ల వ్యాధుల నివారణ, నిర్ధారణ మరియు చికిత్సకు సంబంధించిన దంతవైద్య శాస్త్రంలోని ముఖ్యమైన విభాగమని అన్నారు. ఆయా అంశాలు సమగ్రంగా, సులభంగా అర్థమయ్యే విధంగా పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ దంత వైద్య విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ పుస్తకాన్ని తనకు ప్రోత్సాహం అందించిన విద్యాసంస్థల చైర్మన్ డా సాకిబ్ రసూల్ ఖాన్ కు అంకితం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్రా విద్యాసంస్థల అకాడమీక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినైనా నారాయణమూర్తి పాల్గొన్నారు.

## తలుపురుపాడులో విపిఆర్ నేత్రకు విశేష స్పందన

**200 మందికి పైగా ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు**



**సంగం జూన్ 15(వార్తాప్రభ ప్రతినిధి)** మండలంలోని తలుపురుపాడు గ్రామంలో నిర్వహించిన విపిఆర్ నేత్ర కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.గ్రామంలోని 200 మందికి పైగా ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అర్హులైన వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు.విపిఆర్ నేత్ర చీఫ్ కో-ఆర్డినేటర్ శంకర్ సంగం సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు పర్యవేక్షణలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉచిత కంటి పరీక్షలు కంటి అద్దాల పంపిణీ చేయడం వల్ల ఎంతో ఉపయోగం కలుగుతోందని తెలిపారు.ప్రజలకు ఉచిత సేవలు అందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని అభినందించారు. వైద్య శిబిరం ఏర్పాటుకు సహకరించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## జోగి రమేష్ ని విమర్శించే ముందు టిడిపి నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలి - వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్



**రెడ్డిగూడెం జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని రెడ్డిగూడెం మండల పరిషత్ ఉపాధ్యక్షులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చాట్ల రాబర్ట్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఉచితంగా ఇసుక అందిస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వేల టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తూ కోట్ల రూపాయల ప్రభుత్వం ఖనాజాకు రాకుండా దోచుకోవడం జరుగుతుందని ఆరోపించారు. ఇక రైతుల విషయానికొస్తే ఒక కిలో కూడా తారం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు 100 కిలోలకి పది కిలోల తారం అంటూ రైతాంగాన్ని నిలువునా దోచుకోవడం వాస్తవం కాదా? ఇదే విషయమై రైతులు గగ్గోలు పెడుతున్నా సరే పట్టించుకున్న దాఖలాలు లేవని పదికిలోల తారం డబ్బులు ఎవరు దోచుకుంటున్నారు. అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలలో మొదటగా అమలు చేసేదే ఆడబిడ్డ నిధి అని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ప్రచారంలో ఊదర గొట్టి నేడు వారిని వెన్నుపోటు పొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయనీ వాటిని ప్రశ్నించిన జోగి రమేష్ పై తప్పుడు ఆరోపణలు చేయటం టిడిపి శ్రేణులకు తగదని హితవు పలికారు.

## గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం పై ప్రాంతీయ కార్యశాల విజయవంతం



**జగ్గయ్యపేట జూన్ 18 (వార్తప్రభ)** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని డాక్టర్ కె.ఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), గరికపాడులో ఎన్టీఆర్ జిల్లా కిసాన్ మోర్చా సహకారంతో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం పై నిర్వహించిన ఒక రోజు ప్రాంతీయ కార్యశాల మరియు శిక్షణా కార్యక్రమం ఘనంగా ముగిసింది. నేల సంరక్షణను పెంపొందించడం, సుస్థిర సాగు పద్ధతులు మరియు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ సదస్సు జరిగింది. కార్యక్రమానికి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీ కొల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యశాలలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ ఎమ్. రవి కిషోర్ పరిచయ ప్రసంగం చేస్తూ, ప్రస్తుత కాలంలో భూసార రక్షణకు ప్రకృతి వ్యవసాయం యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు. మధ్యాహ్న విరామం అనంతరం రైతులకు క్షేత్రస్థాయి సాగు విధానాలపై శాస్త్రవేత్తలు నాలుగు ప్రత్యేక సాంకేతిక విభాగాలుగా విస్తృత శిక్షణ ఇచ్చారు. మొదటి విభాగంలో డాక్టర్ ఎమ్. రవి కిషోర్ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించగా, రెండవ విభాగంలో పంటల ఉత్పత్తి విషయ నిపుణులు డాక్టర్ పి.ఎన్. శివ ప్రసాద్ ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను క్షుణ్ణంగా వివరించారు. మూడవ విభాగంలో సస్యరక్షణ విషయ నిపుణులు డాక్టర్ ఎన్. రాజశేఖర్ తెగుళ్లు మరియు కీటకాల నివారణోపాయాలపై శిక్షణ ఇవ్వగా, నాల్గవ విభాగంలో పెనుగంచిప్రోలు ప్రాంతపు ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి జి. వానూరప్ప క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సాధనల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రైతుల సాంకేతిక సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన రైతులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ధృవీకరణ పత్రాలను అందజేశారు. అదేవిధంగా బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ చేతుల మీదుగా రైతులకు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. జి. వానూరప్ప కృతజ్ఞతా వందనం, జాతీయ గీతాలాపనతో ఈ ప్రాంతీయ కార్యశాల విజయవంతంగా ముగిసింది.

## వెంగారెడ్డిపాలెంలో విద్యార్థులకు ఘన వీడ్కోలు



**సంగం జూన్ 15(వార్తాప్రభ ప్రతినిధి)** మండలంలోని వెంగారెడ్డి పాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో 1వ తరగతిలో ప్రవేశించనున్న చిన్నారులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను అభినందించి వారి విద్యాభ్యాసంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి పాఠశాల జీవితంలో కొత్త అనుభవాలను ఆత్మవిశ్వాసంతో స్వీకరించాలని సూచించారు. చిన్నారుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వారిని సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులుఅంగన్‌వాడీ వర్కర్ సుశీలమ్మ ఆయా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేశారు. సాధారణ త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నిర్వహించిన ఈ పరిశీలనలో గోడౌన్‌కు అమర్చిన సీల్స్‌ను, భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తనిఖీ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి సంతకం చేశారు.ఈ సందర్భంగా గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీల్లో ఇన్‌చార్జి డీఆర్ఓ పోతురాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల సామగ్రి భద్రతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## నేడు విజయోత్సవ సభకు తరలిరండి

**రాష్ట్ర డైరెక్టర్ అబ్బూరి రమేష్ నాయుడు పిలుపు**



**అనుమసముద్రంపేట జూన్ 18 (వార్తాప్రభ)** ఆత్మకూరు శ్రీధర్ గార్డెన్స్ లో ఎన్డీఏ కూటమి రెండేళ్ల విజయోత్సవ సంబరాలు ఈనెల 19వ తేదీ శుక్రవారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలోనిర్వహిస్తున్నట్లు ఏ ఎస్ పేట మండలం టిడిపి కన్వీనర్ రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్బూరి రమేష్ నాయుడు తెలిపారు. విధ్వంసం నుంచి వికాసం వైపు సంక్షోభం నుంచి స్వర్ణాంధ్ర వైపురెండేళ్ల ఎన్డీఏ కూటమి పాలనలో ముఖ్యమంత్రి మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు అందించిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పురోగతి సుపరిపాలన-సూపర్ సిక్స్ పథకాలు నేరవేరిన ఎన్నికల హామీలు గురించి అందరికీ వివరిస్తూ విజయోత్సవ సంబరాల సదస్సు నిర్వహిస్తారని పేర్కొన్నారు అలాగే

**లబ్ధిదారులతో ముఖాముఖి** సమావేశం శుక్రవారం ఉదయం 10.00 గంటలకు ఆత్మకూరు హైవే లోని శ్రీధర్ గార్డెన్స్ ఫంక్షన్ హాలు నందు ఏర్పాటు చేయడమైనదన్నారు.కావున సదరు సమావేశంలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఏఎస్ పేట మండలంలోని తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీ ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అభిమానులు సాగునీటి సంఘాలు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు మార్కెటింగ్ కమిటీల గ్రామ మండల నియోజకవర్గ పార్లమెంటు స్థాయి పార్టీ కమిటీల బాధ్యులు,సభ్యులందరూ తప్పక పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి ఒక్కరూ విధిగా పార్టీ ఐడి కార్డు కండువా లేదా పసుపు వస్త్రాలు ధరించి హాజరు కావలసినదిగా అబ్బూరి రమేష్ నాయుడు కోరారు.అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు బి ఎల్ వో లు మరియు బిఎల్ఏ లతో ముఖాముఖి సమావేశం జరుగుతుందని తెలిపారు.కావున మండలంలోని పోలింగ్ బూత్ ల ఏజెంట్లు (టిడిపి) గ్రామ మండల నియోజకవర్గ పార్లమెంటు స్థాయి పార్టీ కమిటీ బాధ్యులు తప్పక పాల్గొనవలసిందిగా కోరారు

## సర్ ప్రక్రియలో బిఎల్ఓ లు ఓట్లు పరిశీలన



**చేజర్ల జూన్ 18 (వార్తాప్రభ)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ అనే కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గం లోని చేజర్ల మండల కేంద్రంలో ఉన్న చేజర్ల గ్రామ పంచాయతీ లోని 263, 264, 265 బూత్ లకు సంబంధించిన ఓట్లు వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా చేజర్ల మండల టీడీపీ సీనియర్ నాయకులు రావి లక్ష్మీ నరసారెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ రావి కృష్ణారెడ్డి బూత్ కన్వీనర్లు అరవ దామోదర్ రెడ్డి షేక్ నజీర్ ఆత్మకూరు పెంచలయ్య మరియు బిఎల్ఓ లతో కలసి సంబంధిత అధికారులు ఓట్లు వెరిఫికేషన్ చేయడం జరిగింది.ఓట్లు వెరిఫికేషన్ ప్రక్రియ చాలా సమర్థవంతంగా పారదర్శకంగా జరగాలని పలు రాజకీయ పార్టీలకు సంబంధించిన బూత్ లెవెల్ ఏజెంట్లు సంబంధిత అధికారులను కోరారు.

## టీబీ ముక్త భారత్ 2.0 కార్యక్రమం నిర్వహణ

**పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు**



**సంగం జూన్ 15 (వార్తాప్రభ ప్రతినిధి)** మండలంలోని సంగం పీహెచ్‌సీ పరిధిలో గల పెరమన సబ్‌సెంటర్‌లో గురువారం టీబీ ముక్త భారత్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ ఖాదర్ వలీ ఆదేశాల మేరకు డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ముఖ్యమని తెలిపారు.దగ్గు జ్వరం బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. అధునాతన హ్యాండ్‌హోల్డ్ ఎక్స్‌రే యంత్రంతో పరీక్షలు నిర్వహించి తక్కువ సమయంలోనే టీబీ నిర్ధారణ చేపట్టారు.టీబీ నిర్ధారణ అయిన వారికి ఆశా వాలంటీర్ల పర్యవేక్షణలో ఆరు నెలల పాటు మందుల కోర్సు అందిస్తామని తెలిపారు.మండలంలోని దువ్వూరు పడమటి పాలెం సంగం పెరమణ గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.రెండో విడతలో 14 సంవత్సరాల పైబడిన వారికి కూడా పరీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెల్త్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలు ఆశా వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆముదాలపల్లి లో అగ్నిప్రమాదం 1.50 లక్షల ఆస్తి నష్టం...

**కృత్తివెన్ను జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బంటుమిల్లి మండలం ఆమదాలపల్లి గ్రామంలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎస్సీ కాలనీకి చెందిన అలివేలు మంగమ్మ ఒంటినిట్టాడు పాక అగ్నికి ఆహుతి అయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెంటనే చేరుకుని మంటలను అదుపులోనికి తీసుకుని వచ్చారు. ఈ ప్రమాదంలో సుమారుగా1.50 లక్షల రూపాయలు నష్టం వాటిలిందని ఫైర్ ఆఫీసర్ గరికపాటి రామ్మోహన్ రావు తెలిపారు. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందని అధికారి తెలియజేశారు.

## జగ్గయ్యపేట బ్రాహ్మణ బజార్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పర్యటన



**జగ్గయ్యపేట జూన్ 18 (వార్తప్రభ)** ప్రజా సమస్యల పరిష్కారం, వార్డుల అభివృద్ధి మరియు మెరుగైన పౌర సేవల కల్పన లక్ష్యంగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర 20వ వార్డులోని బ్రాహ్మణ బజార్ ప్రాంతంలో పర్యటించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తో కలిసి స్థానిక ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలు మరియు అభివృద్ధికి సంబంధించిన సూచనలను అడిగి తెలుసుకున్నారు. ప్రాంతంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్డు నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ తదితర అంశాలపై ప్రజలు తెలిపిన సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఈ సందర్భంగా శాసనసభ్యులు తెలిపారు. ఇంటింటికీ చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు 10 ఈ-ఆటోలను కొనుగోలు చేయడంతో పాటు, 20 పుష్ కార్టులను కూడా సమకూర్చే ప్రక్రియలో మున్సిపాలిటీ ఉందని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా పట్టణంలో పారిశుద్ధ్య ప్రమాణాలు మరింత మెరుగుపడి ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి వార్డును సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ ప్రసాద్, కౌన్సిలర్ గొట్టే నాగరాజు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి చిన్న, కోటగిరి సుధాకర్, మద్దుల ఉమా, పారేపల్లి సూరిబాబు, షేక్ మాబ్ మియా తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు పురుగుమందు దుకాణాలపై ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు

**అదనంగా ఉన్న యూరియా బస్తాలు సీజ్ - ఆపై క్రిమినల్ కేసు**



**చేజర్ల జూన్ 18 (వార్తాప్రభ)** నెల్లూరు జిల్లాలోని చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి గ్రామంలో శ్రీ వీరాంజనేయ ఏజెన్సీస్ అనే ఎరువులు మరియు పురుగుల మందు షాపు మీద నెల్లూరు జిల్లా బిజినెస్ మరియు ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మరియు స్థానిక ఏవో జరిపిన ఇన్స్పెక్షన్ లో 1423 యూరియా బస్తాలు వాటి విలువ 12,89,847 రూపాయలు అదనంగా ఉన్నట్టు కనుగొనడం జరిగింది.వాటిని సీజ్ చేసి దానిపైన క్రిమినల్ కేసు కూడా పెట్టడం జరుగుతుంది.ఈ యొక్క ఇన్స్పెక్షన్ లో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ షేక్ సుభాని ఏఓ పి.వేణుగోపాలరావు మరియు స్థానిక ఏవో హిమబిందు పాల్గొన్నారు

# ప్రశాంతంగా ఉండడానికి, ఏకాగ్రత కు యోగా ఆయుధం



**విజయవాడ పశ్చిమ జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**యోగా ద్వారా ప్రశాంతత మరియు ఏకాగ్రత అలవడటమే కాకుండా ఒక క్రమబద్ధమైనటువంటి జీవితానికి ,మనం ఒత్తిడి తగ్గించుకోవడానికి చాలా బాగా ఉపయోగపడుతుందని జిఎన్ఆర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివి రవికుమార్ అన్నారు వచ్చే ఆదివారం జరుగునున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం పాఠశాలలో యోగా దినోత్సవం సంబంధించి విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులందరినీ యోగ డే అనే అక్షరాల రూపంలో విద్యార్థులు కూర్చొని యోగ సాధన చేశారు ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక ఆందోళన ,పని ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు ఇలాంటి వాటి నుండి దూరంగా ఉండాలంటే యోగా మంచి సాధనం అని అన్నారు .యోగ నేర్చుకొని ప్రతిరోజు తప్పనిసరిగా సాధన చేసినట్లయితే మనసు ఎంతో చైతన్యంగా ఉండటమే కాకుండా ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా కూడా కాపాడుకోవచ్చని సూచించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉదయ్ కిరణ్ ,గణేష్, వసంత లక్ష్మి, మనోజ్, అస్మాబాను తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఉచిత ప్రవేశాల పంపిణీ.

**ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీత గౌడ్.**





**జవహర్ నగర్, జూన్ 18: (వార్తా ప్రభ)**విద్య అనే దీపం వెలిగితేనే... పేదరికం అనే చీకటి తొలగిపోతుందని టు బిహెచ్ కె జెఏసి అధ్యక్షుడు సందీప్ పేర్కొన్నారు. అహ్మద్‌గూడ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోని నిరుపేద కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తెలంగాణ డిగ్నిటీ హౌసింగ్ కాలనీస్ టు బిహెచ్కె జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత ప్రవేశాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన ఐదుగురు విద్యార్థులకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ది సిటీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, గౌతమీ హై స్కూల్‌లలో ఉచిత ప్రవేశాలు కల్పించారు.కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీత గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందజేశారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తెలంగాణ టు బిహెచ్కె జేఏసీ అధ్యక్షుడు సందీప్, కార్యదర్శి జంగిలి శివకుమార్, సభ్యుడు రాము తదితరులు మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలకు విద్యా అవకాశాలు కల్పించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించే అవకాశం కల్పించిన భవిష్యత్తులో కూడా ఇలాంటి విద్యా సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరారు.కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, లబ్ధిదారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూపీఐ లేకపోతే పోస్టల్ బుకింగ్ ఉండదా

**ఏకంగా బోర్డు పెట్టేసిన జగ్గయ్యపేట పోస్ట్ ఆఫీస్ సిబ్బంది**

**జగ్గయ్యపేట జూన్ 18 (వార్తా ప్రభ)** మీరు జగ్గయ్యపేట పోస్ట్ ఆఫీస్ లో స్పీడ్ పోస్ట్ లేదా ఏమైనా సేవలు బుకింగులు చేసుకోవాలనుకుంటున్నారా మీకు కచ్చితంగా యూపీఐ ఉండాల్సిందే లేకపోతే స్పీడ్ పోస్ట్, ఎలాంటి బుకింగ్ లు చేసుకోమంటున్న జగ్గయ్యపేట పోస్టల్ సిబ్బంది. యూపీఐ లేకపోతే బుకింగ్ చేసుకోమని ఏకంగా బోర్డు పెట్టేశారు. నగదు రూపేనా చెల్లిస్తామంటే అలా కుదరదు అని కచ్చితంగా చెప్పేస్తున్న సిబ్బంది. వివరాల్లోకి వెళ్తే గురువారం నాడు వినియోగదారుడు పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ కి వెళ్లి స్పీడ్ పోస్ట్ బుక్ చేయాలని కోరగా యూపీఐ ద్వారా పేమెంట్ చేయాలని లేకపోతే స్పీడ్ పోస్ట్ బుక్ చేయమని సిబ్బంది నుంచి సమాధానం వచ్చిందని. పోస్ట్ మాస్టర్ ని అడిగితే డిజిటలైజేషన్ లో భాగంగా కచ్చితంగా యూపీఐ పేమెంట్ చేయాల్సిందేనని లేకపోతే బుకింగ్ కుదరదని తెలియజేశారని. తన దగ్గర యూపీఐ లేకపోవడం వల్ల తప్పని పరిస్థితిలో తమ కుమార్తె యూపీఐ నుండి పేమెంట్ చేసి బుకింగ్ చేయాల్సి వచ్చిందని తెలియజేశారు. డిజిటలైజేషన్ చేయడం మంచి నిర్ణయమే అని పోస్ట్ ఆఫీస్ అంటే రైతులు, చదువురాని




వారు, స్మార్ట్ ఫోన్ వినియోగించని వారు వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలకు డిజిటల్ పేమెంట్ పై అవగాహన వచ్చేవరకు నగదు రూపేనా కూడా చెల్లించే అవకాశం కల్పించాలని కోరారు. పోస్టల్ డిపాజిట్లు, సేవింగ్స్ ఇతర కార్యక్రమాలకు నగదు రూపేనా తీసుకొని స్పీడ్ పోస్ట్ కు మాత్రం యూపీఐ మాత్రమే చేయాలనడం ఎంతవరకు సమంజసం అని వినియోగదారుడు ప్రశ్నిస్తున్నాడు. ఈ విషయమై పోస్టల్ ఇన్స్పెక్టర్ ని సమాచారం కోరగా వినియోగదారుడికి యూపీఐ అవకాశం లేనప్పుడు నగదు రూపేణా చెల్లించి పోస్టల్ సేవలు పొందచ్చని తెలియజేశారు.

# పారిశుద్ధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి నూతనంగా కొనుగోలు చేసిన పుష్‌కార్టులను పరిశీలించిన ఎమ్మెల్యే

**జగ్గయ్యపేట జూన్ 18 (వార్తప్రభ)** పట్టణం లో పారిశుద్ధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి నూతనంగా కొనుగోలు చేసిన పుష్‌కార్టులను పరిశీలించిన ఎమ్మెల్యే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇటీవల పట్టణంలోని పలు వార్డులను సందర్శించిన సమయంలో స్థానిక ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ముఖ్యంగా ఇంటింటికీ చెత్త సేకరణ, వీధుల పరిశుభ్రత, వ్యర్థాల తరలింపు వంటి అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారని చెప్పారు. ప్రజల సూచనలు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.అందులో భాగంగానే నూతన పుష్‌కార్టులను అందుబాటులోకి తీసుకువచ్చామని, పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన పరికరాలు సమకూర్చడంతో పాటు వ్యర్థాల సేకరణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రజల సహకారం కూడా అవసరమని ఎమ్మెల్యే కోరారు.మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ, మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సేవలను మెరుగుపరచడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు.ఇప్పటికే నూతన



పుష్‌కార్టులు అందుబాటులోకి వచ్చాయని, ఈ నెల 20వ తేదీ నాటికి 10 ఈ-ఆటోలు కూడా మున్సిపాలిటీకి చేరుకోనున్నాయని చెప్పారు. వీటి ద్వారా డోర్ టు డోర్ వ్యర్థాల సేకరణను మరింత వేగవంతంగా మరియు సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.మున్సిపల్ కమిషనర్ పి . వి . వి . డి . ప్రసాద్ మాట్లాడుతూ, పారిశుద్ధ్య సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సేంద్రీయ వ్యవసాయ అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట జూన్ 18 (వార్తప్రభ)**మండలం గరికపాడు వద్ద గల డా. కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సేంద్రీయ పద్ధతుల ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూమి సారవంతత తగ్గిపోవడంతో పాటు మానవ ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని పేర్కొన్నారు.సేంద్రీయ వ్యవసాయం ద్వారా భూమి సహజ సారాన్ని కాపాడుకోవడంతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పొందవచ్చని వివరించారు.రైతులు సంప్రదాయ వ్యవసాయ విధానాలతో పాటు ఆధునిక సేంద్రీయ సాంకేతికతలను అవలంబించి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. పశువుల ఎరువు, జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు.సేంద్రీయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతుల ఆదాయం కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ వివిధ పథకాలు అమలు చేస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల అభ్యున్నతికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు అందిస్తున్న సూచనలు, సలహాలను పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిషాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోసాని గురునాథం, తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్ కసుకుర్తి శ్రీనివాసరావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డు మల్లికార్జున్, మన్నె శ్రీనివాసరావు, వక్కంతు సుధాకర్,కీసర రాంబాబు, కోవెలమూడి వెంకటేశ్వరరావు, పగడాల శ్రీనివాసరావు, బొమ్మ దేవర శ్రీనివాసరావు, అన్నెపాగ ప్రపుల్ల శ్రీకాంత్, కల్లూరి శ్రీవాణి,వశ్రమ్ ,మన్నె మాధవి మరియు వ్యవసాయ శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు, రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వన మహోత్సవ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- కిన్నెరసాని తెలంగాణకు ఊపిరితిత్తుల వంటిది - ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- జిల్లాలో 55 లక్షల మొక్కల నాటడమే లక్ష్యం - జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హరిత కార్యక్రమాలతో పాటు కిన్నెరసాని వన్యప్రాణి నిర్వహణ కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వర్చువల్ విధానంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో భాగంగా కిన్నెరసాని వన్యప్రాణి నిర్వహణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం .45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సఫారీ వాహనాలు, ట్రెక్కింగ్ సౌకర్యం, బటర్‌ఫ్లై పార్క్, జింకల పార్కులో ఫీడింగ్ షెడ్, సీసీ రోడ్డు తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న జిల్లాగా గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అని పేర్కొన్నారు. కిన్నెరసాని తెలంగాణకు ఊపిరితిత్తుల వంటిదని అన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులకు పోడు భూములపై హక్కులు కల్పించడంతో పాటు కొత్తగా అటవీ భూముల ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కిన్నెరసానిని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కిన్నెరసానిలో తీగల వంతెన నిర్మాణం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని, అద్దాల మేడ, జూ పార్కు, బోటు షికారు, పర్యాటక హోటల్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మణుగూరులోని వేడి నీటి గుంతల ప్రాంతం వరకు కిన్నెరసాని సఫారీ కారిడార్ ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా అతి త్వరలో కొత్తగూడెం పట్టణానికి రూ.500 కోట్ల వ్యయంతో రింగ్ రోడ్డు, అతి పెద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి మంజూరుకు చర్యలు జరుగుతున్నాయని వెల్లడించారు. అటవీ సంపద పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, జిల్లాలో హరితాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 50 శాతం భూభాగం అటవీ ప్రాంతంగా ఉందని, జిల్లా ప్రజల జీవన విధానం అడవులతో ముడిపడి ఉందన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 55 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 42 శాఖలకు మొక్కల నాటే బాధ్యతలను కేటాయించామని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. గత 24 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రాత్రి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవడం ఆందోళనకర విషయమని, పర్యావరణ సమతుల్యత కోసం విస్తృత స్థాయిలో మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు మొక్కల సంరక్షణపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నాటిన మొక్కల్లో కనీసం 95 శాతం మొక్కలు వృక్షాలుగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం అని తెలిపారు. జిల్లాలో సుమారు ఎనిమిది లక్షల ఎకరాల అటవీ భూమి ఉన్నదని పేర్కొన్నారు. గతంలో కొంత మేర అటవీ భూమిని కోల్పోయినప్పటికీ ప్రస్తుతం అటవీ సంపద పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అభివృద్ధి, అటవీ సంరక్షణ, గిరిజనుల సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా కిన్నెరసానిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం సఫారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సర్పంచ్ వజ్జా రామకృష్ణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఎఫ్డిఓలు బాబు, చారి, తాసిల్దార్ ధారా ప్రసాద్,అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ప్రకృతి ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన హుండీల లెక్కింపు



**జగ్గయ్యపేట జూన్ 18 (వార్తప్రభ)** మండలం తిరుమలగిరి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థాన హుండీలను గురువారం ఉదయం 9 గంటలకు దేవాదాయ శాఖ జిల్లా అధికారి ఎన్ షణ్ముగం ఆధ్వర్యంలో తెరిచి లెక్కించారు.ఈ కార్యక్రమంలో ఈఓ రంగారావు , దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ గుమ్మా వెంకటేష్ , ధర్మకర్తల మండలి సభ్యులు ఎలమందల కవి, పునుగుపాటి పుల్లయ్య, దుగ్గిరాల ధనలక్ష్మి, పొట్లకాయల నాగయ్య, కందుకూరి రమణకుమారి , అలాగే పరిటాల సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.హుండీల లెక్కింపులోప్రధాన దేవాలయ హుండీల ద్వారా రూ. 36,30,844/- శివాలయ హుండీల ద్వారా రూ. 41,624/- అన్నదాన హుండీ ద్వారా రూ. 47,831/- వెరసి మొత్తం రూ. 37,20,299/- ఆదాయం లభించింది.ఈ ఆదాయం గత మూడు నెలల కాలానికి సంబంధించినదిగా అధికారులు తెలిపారు.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో తిరుమలగిరి గ్రామ రెవెన్యూ అధికారి, పరిటాల సేవా సమితి సభ్యులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్జీయుకేటిలో ఎన్.సి.సి. వార్షిక శిక్షణా శిబిరం



**నూజివీడు, జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆర్జియుకేటీ నూజివీడు ప్రాంగణంలో 12.06.2026 నుండి 21.06.26 వరకు జరుగుతున్న 4 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ విజయవాడ యూనిట్ వారు 624 మంది క్యాడెట్స్ తో నిర్వహిస్తున్న అన్యూయల్ ట్రైనింగ్ క్యాంప్ నందు 18.06.26న కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ శిక్షణా శిబిరంలో ప్రతిరోజు జరుగుతున్నటువంటి కార్యక్రమాల వివరాలను క్యాంప్ కమాండ్ అయినటువంటి కల్నల్ బలేందర్ సింగ్ గ్రూప్ కమాండర్ కి వివరించారు. ఈ శిక్షణ శిబిరంలో భాగంగా కవాతు, మ్యాప్ రీడింగ్, యోగ, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, ఫీల్డ్ సిగ్నల్స్,సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు మొదలైన పోటీలను నిర్వహించారు. ఎన్.డి.ఆర్.ఎఫ్ సిబ్బంది ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే వాటి మీద క్యాడెట్స్ కు అవగాహన కల్పించినారు. ఈ శిక్షణా శిబిరానికి కాకినాడ గ్రూప్ ట్రైనింగ్ ఆఫీసర్ కల్నల్ అనిల్ సింగ్ కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం వహించారు. ఈ సందర్భంగా నిర్వహించినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి..

# కృష్ణాజిల్లాలో బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు - 10 మంది అరెస్ట్..



**మచిలీపట్నం జూన్ 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా వ్యాప్తంగా పోలీసులు బెల్ట్ షాపులపై విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటూ 10 కేసులు నమోదు చేసి 10 మందిని అరెస్ట్ చేశారు. జిల్లాలోని గిలకలదిండి, పిండివారిపాలెం, మాట్లం, ఎదురుమొండి, కోసూరు, నిడుమోలు, చౌటపల్లి, పెద్దపారుపూడి, నారాయణపురం, కేసరపల్లి గ్రామాల్లో ఈ దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం 19.08 లీటర్ల మద్యం, 106 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కూచిపూడి, యాకమూరు, గన్నవరం ప్రాంతాల్లో బహిరంగ మద్యపానానికి సంబంధించి 3 కేసులు నమోదు చేశారు. జిల్లాలో అక్రమ మద్యం విక్రయాలు, బహిరంగ మద్యపానాన్ని అరికట్టేందుకు ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ప్రజలు చట్టాలను పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**ఎల్బీనగర్/వార్తప్రభ( జూన్ 18):** తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' పనులను స్థానిక ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులతో కలిసి సైట్‌ను సందర్శించిన ఆయన, లేఅవుట్ ఆధారంగా పాఠశాల భవనాలు, డిజిటల్ తరగతి గదులు, హాస్టళ్లు, ల్యాబ్‌లు, డైనింగ్ హాళ్లు, క్రీడా మైదానాల నిర్మాణ పురోగతిని నిశితంగా సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యనందించాలనే సీఎం రేవంత్ రెడ్డి గారి కలల ప్రాజెక్ట్ ఇది అని కొనియాడారు. భవిష్యత్ తరాల విద్యకు ఈ ప్రాంగణం ఒక విద్యా యజ్ఞంలా మారుతుందన్నారు. నిర్మాణ నాణ్యత, సాంకేతిక ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎక్కడా జాప్యం జరగకుండా, నిర్దేశిత గడువు కంటే ముందే పనులను పారదర్శకంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. నేటి విద్యార్థులే రేపటి దేశ శిల్పులని, ఈ స్కూల్ వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 25 ప్రగతి సూచికల్లో 100 శాతం ప్రగతి

- మిగిలిన 13 సూచికల్లోనూ సత్వర అభివృద్ధికి చర్యలు
- మహిళాసాధికారతకు సరికొత్త వేదిక గుంటుపల్లి రైజ్
- ఇబ్రహీంపట్నం బ్లాకులో పర్యటించిన కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు



**ఇబ్రహీంపట్నం, జూన్ 18 (వార్తా ప్రభ ప్రతినిధి):** జిల్లాలో ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద ఉన్న ఇబ్రహీంపట్నం ఆకాంక్షిత బ్లాకులను ఆదర్శ బ్లాకులుగా తీర్చుదిద్దేందుకు సమష్టిగా కృషిచేయడం జరుగుతోందని.. ఇబ్రహీంపట్నంలో సంతృప్తి స్థాయికి తీసుకెళ్లాల్సిన 38 సూచికల్లో ఇప్పటికే 25 సూచికల్లో 100 శాతం పురోగతి సాధించినట్లు కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు తెలిపారు. వీలైనంత త్వరగా మిగిలిన 13 సూచికల్లోనూ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేస్తున్నట్లు వెల్లడించారు.నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్, కేంద్ర ప్రభారీ అధికారి అశోక్‌బాబు గురువారం ఇబ్రహీంపట్నం మండలంలో పర్యటించారు. కొటికలపూడిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాల అమలుతీరును పరిశీలించారు. మూలపాడులోని ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టిన మునగ, నిమ్మ ప్లాంటేషన్ ప్రాంతాలను, బటర్‌ఫ్లై పార్కును సందర్శించారు. కొండపల్లిలో ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలతో పాటు గుంటుపల్లిలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని సందర్శించి.. మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేసేందుకు అమలు చేస్తున్న వినూత్న శిక్షణ కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు.క్షేత్రస్థాయి పర్యటన అనంతరం అశోక్‌బాబు ఎంపీడీవో కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, మానవాభివృద్ధి సూచికల్లో ప్రగతి సాధించేలా గౌరవ ప్రధాని దార్శనికతకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా 500కు పైగా బ్లాక్‌లను కేంద్రం ఆకాంక్షిత బ్లాకులుగా ప్రకటించిందని.. ఇందులో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో 15 బ్లాకులు ఉన్నాయన్నారు. ఎన్‌టీఆర్ జిల్లాకు సంబంధించి ఇబ్రహీంపట్నం మండలాలు ఉన్నాయన్నారు. మిగిలిన మండలాలతో సమానంగా ప్రగతి సాధించేలా ప్రత్యేక దృష్టిపెట్టి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం జరుగుతోందన్నారు. ఇంటింటికీ కుళాయి ద్వారా నీటి సరఫరా, గృహనిర్మాణం వంటి వాటికి సంబంధించిన సూచికల్లోనూ సంతృప్తికర స్థితికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కీలక ప్రగతి సూచికల్లో పురోగతిని ఎప్పటికప్పుడు మదిస్తూ.. మెరుగైన ప్రణాళికలను అమలుచేస్తూ ముందుకెళు న్నామని, ఈ దిశగా అడుగులు వేస్తూ ఏవైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే గుర్తించి సత్వరం పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ వారి సారథ్యంలో బ్లాకు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసి అన్ని సూచికల్లో ప్రగతి దిశగా తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. స్థానిక అధికారులతోనూ సమన్వయం సమావేశం నిర్వహించామని, అన్ని సూచికల్లోనూ ముందడుగు వేసేందుకు అనురించాల్సిన ప్రణాళిక, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు అశోక్‌బాబు వెల్లడించారు.



నూజివీడు మండలం బత్తులవారిగూడెం లో నూజివీడు మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు ముసునూరు రాజాగారి కుమార్తె నిశ్చయతాంబూలాల కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారధి.మంత్రివర్యులు వెంట నూజివీడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వై, శ్రీనివాసు, సతీష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.
–నూజివీడు,జూన్ 18 (వార్తాప్రభ) :

# నేడు 10 గ్రామాల్లో ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం...



**గుడ్లవల్లేరు,జూన్ 18 (వార్తాప్రభ) :** మండలంలోని 10 గ్రామాల్లో ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు గుడివాడ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి.శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గుడ్లవల్లేరు మండల పరిధిలోని కౌతవరం, బలరాంపురం, పద్మాలపాలెం, వేమవరం, వేమవర ప్పాలెం, వడ్లమన్నాడు, ఉలవలపూడి, రెడ్డిపాలెం, భీమునిగుంట, గాదేపూడి గ్రామాల్లోని విద్యుత్ లైన్ మైంటెనెన్స్, మరమ్మత్తులతో పాటు విద్యుత్ లైన్ల దగ్గర ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని చెప్పారు. కావున గృహ, వాణిజ్య, ఆక్వా వినియోగదారులు అందరూ గమనించి సహకరించివలసిందిగా ఈఈ శ్రీనివాసరావు కోరారు.

# బెటర్మెంట్ ఫలితాల్లో నూజివీడు శ్రీ శారద విద్యార్థుల సత్తా..

● ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో స్టేట్ సెకండ్ ర్యాంకులు



**నూజివీడు,జూన్ 18 (వార్తాప్రభ) :** ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బెటర్మెంట్ పరీక్షల ఫలితాల్లో నూజివీడుకు చెందిన శ్రీ శారద విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకులు సాధించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఎంపీసీ విభాగంలో విద్యార్థిని వి. సాయి భావన 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించింది. అలాగే బైపీసీ విభాగంలో విద్యార్థినులు ఎం.వి. తేజస్విని, ఎం. బ్లెస్సి షాలోమ్ 455 మార్కులకు గాను 451 మార్కులు సాధించి రాష్ట్ర ద్వితీయ ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ శారద విద్యాసంస్థల అధినేత కుప్పాల శంకర్రావు మాట్లాడుతూ, విద్యార్థులు తమ గత మార్కులను అధిగమించి మరోసారి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం వారి కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల ప్రోత్సాహానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలు సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపక బృందాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# విజయోత్సవ వేడుకలకు తరలి వెళ్లిన కూటమి శ్రేణులు



**కోడూరు, జూన్ 18 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు కాలం పూర్తి ఐన సందర్భంగా “రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం” అనే ప్రధాన నినాదంతో నిర్వహిస్తున్న విజయోత్సవ వేడుకలకు కోడూరు మండల కూటమి నాయకులు తరలి వెళ్లారు. ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో సాధించిన ప్రగతిని, ప్రజల్లో కల్పించిన నమ్మకాన్ని ఈ సంబరాల ద్వారా చాటి చెప్పేందుకు ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి నాయకుల నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు.

# ఉచిత ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి..



**కోడూరు, జూన్ 18 (వార్తాప్రభ) :** కోడూరు మండలంలో నిర్వహిస్తున్న ఉచిత ఆధార్ క్యాంప్ ను మండల ప్రజలు వినియోగించుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. గురువారం కోడూరు లక్ష్య స్కూల్ నందు నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. గురు,శుక్ర వారాలలో,ఈనెల 22నుంచి 26 వరకు ఉచిత ఆధార్ క్యాప్ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

# జిల్లాలో సాఫీగా సర్ ఇంటింటి సర్వే..

● బీఎల్‌వోల ద్వారా 2,74,614 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ● ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రక్రియ వేగవంతానికి నిరంతర పర్యవేక్షణ ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,జూన్ 18 (వార్తాప్రభ) :** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ–సర్ ప్రక్రియకు సంబంధించి ఇంటింటి సర్వే సాఫీగా జరుగుతోందని.. ఇప్పటివరకు బీఎల్‌వోల ద్వారా 2,74,614 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్ ప్రక్రియకు సంబంధించి జిల్లాలో 17,13,445 మంది ఓటర్లు ఉన్నారని.. బీఎల్‌వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందించడంతో పాటు వాటిని నింపి తిరిగి ఇవ్వడంలో సహకరిస్తున్నారన్నారు. అదేవిధంగా 10,870 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిలా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో ఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు కీలకపాత్ర పోషించేలా దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో సగటున ఒక్కో బీఎల్‌వో పరిధిలో 956 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా జులై 14వ తేదీ వరకు బీఎల్‌వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందిస్తారని.. నింపిన వాటిని తిరిగి సేకరిస్తారని, ఇందుకు ప్రతి ఇంటికీ కనీసం మూడుసార్లు వెళ్లనున్నారని తెలిపారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చైతన్యవంతంగా కార్యక్రమంలో పాల్గొని బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

# పొగాకు రైతుల సంక్షోభన్ని ప్రభుత్వం తప్పించాలి

– వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి



**గుడివాడ,జూన్ 18 (వార్తాప్రభ) :** రోజు రోజుకీ మరింత తీవ్ర మవుతున్న రాష్ట్ర పొగాకు రైతుల సంక్షోభం నుండి ప్రభుత్వం అదుకోవాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంపిఎస్ నాగిరెడ్డి గుర–ువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పొగాకు రైతు ఇప్పటి వరకూ అమ్మిన సరాసరి అమ్మకం ధర పెరిగిన ఉత్పత్తి వ్యయంతో పోల్చితే నష్ట పోయి–ంనది 2080 కోట్లున్నారు. గత 2 సంవత్సరాలుగా మార్కెటింగ్ సీజన్‌తో పోలిస్తే కేవలం రెండు రబీ సీజన్‌ల లోనే రాష్ట్రంలో పొగాకు రైతులు తీవ్ర ఆర్ధిక సంక్షోభంలో ఉన్నరన్నారు. ఇంతటి సంక్షోభంలో రైతులు ఉంటే ఆదుకోవలసిన బాధ్యత ఎవరిదిన్నారు. 2025–26 రబీ తీసుకుంటే సాగు విస్తీర్ణం గత సంవత్సరం 1.20 లక్షల హెక్టార్లు అయితే, ఈ సంవత్సరం 1.17 లక్షల హెక్టార్లు. మూడవ ముందస్తు అంచనా ప్రకారం హెక్టారు సరాసరి దిగుబడి 2221 కిలోలు. దీని ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఉత్పత్తి అంచనా షుమారు 260 మిలియన్ కేజీలు రావాలన్నారు. .సరాసరి అమ్మకం ధర కిలోకి రూ.237.21కి పడిపోయింది. అదే1.6.2026 నాటికి మరింత తగ్గి రూ 235.63 పడిపోయింది. అదే 9.6.26 నాటికి రూ 232కి మరింత తగ్గింది. మొత్తం సరాసరి అమ్మకం ధర రూ 230.58 ఈ నెలలో మొత్తం సరాసరి అమ్మకం ధర 228.60 పడిపోయిందన్నారు. ఇంత సంక్షోభంలో పొగాకు రైతులు కూరుకుపోతుంటే ప్రభుత్వం యంత్రాంగం తీసుకున్న చర్యలు ఏమిటిని ప్రశ్నించారు. చరిత్రలో మొట్ట మొదటి సారిగా జగన్మోహన్‌రెడ్డి మ–ుఖ్యమంత్రిగా పొగాకును కూడా మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేయించారు. ఇప్పుడు రైతులు తీవ్రంగా నష్ట పోతున్నా ఈప్రభుత్వ యంత్రాంగం ఆ ప్రయత్నం ఎందుకు చెయ్యటం లేదో రైతులకు అర్థం కావటం లేదన్నారు. మంచి దిగుబడి, క్వాలిటీ ఉత్పత్తి పండించి కూడా సరాసరి అమ్మకం ధరలు రోజు రోజుకూ కుప్ప కూలి పోవడం మూలంగా రైతు తీవ్ర ఆర్ధిక సంక్షోభం లోనికి వెళ్లి పోతున్నాడని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకుని, వ్యవసాయ ఉత్పత్తుల గిట్టుబాటు ధరలపై దృష్టి పెట్టక పోతే, రాష్ట్ర వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభం లోనికి వెళ్లిపోయి, తదనుగుణంగా రాష్ట్ర ఆర్ధిక పరిస్థితి కూడా ప్రమాదంలో పడే పరిస్థితి ఉందన్నారు.

# కోటి యాభై లక్షలతో ముకొల్లుపాడు గ్రామ అభివృద్ధికి సుమారు. రూ.1.50 లక్షలు గ్రాంట్లు మంజూరు చేసి సిసి రోడ్లు ప్రారంభించడంతో రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారధికి పాలాభిషేకం చేసిన గ్రామస్తులు





**నూజివీడు,జూన్ 18 (వార్తాప్రభ) :** నూజివీడు మండలం ముకొల్లుపాడు గ్రామం గత 20 ఏళ్ల నుండి అభివృద్ధికి నోచుకోక రోడ్లు మరియు డ్రైనేజీలు అస్తవ్యస్తంగా తయారై అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామానికి ఇప్పుడు కొత్త వెలుగులు కొత్త కాంతులు వచ్చాయి. రాష్ట్ర గృహ నిర్మాణం మరియు శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి గ్రామంలో పర్యటన నిమిత్తం వెళ్ళినప్పుడు గ్రామస్తులు నాయకులు గ్రామంలో రోడ్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నామని, సిసి రోడ్లు డ్రైనేజీలు నిర్మించాలని మంత్రివర్యులు కోరగా,తక్షణమే స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని మాట ఇచ్చిన కొంత కాలానికే సుమారు.రూ.1.50 కోట్లతో సిసి రోడ్లు మంజూరు చేసి పనులు ప్రారంభించిన సందర్భంగా గ్రామస్తులు కూటమి నాయకులందరూ కలిసి రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి చిత్రపటానికి పాలాభిషేకం చేసి వారి యొక్క అభిమానాన్ని సంతోషాన్ని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కూటమి నాయకులు కలగర సాయి, తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో రాష్ట్ర ప్రగతిలో జిల్లా అగ్ర భాగం

–కాకినాడలో కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభలో పలువురు వెల్లడి





**కాకినాడ, జూన్ 18 (వార్తాప్రభ) :** రెండేళ్లలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను జరిగాయని వాటిలో కాకినాడ జిల్లా అగ్రభాగంలో ఉందని పలువురు నేతలు స్పష్టం చేశారు. కాకినాడలోని సూర్యకళా మందిరంలో రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమ విజయోత్సవ సభను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూటమిలో భాగస్వామి అయినా టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, కార్యకర్తల పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభను నేతలంతా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అధ్యక్షత వహించగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నో విజయాలను సాధించి ఆ ఫలాలను అర్హులైన ప్రజలకు అందించినట్లు చెప్పారు. చిందరవందరగా ఉన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ప్రజాపాలనను అందించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న నాటి భయంకర పరిస్థితులను అధిగమించి ప్రశాంతమైన వాతావరణాన్ని రాష్ట్రంలో కల్పించినట్లు చెప్పారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో భారీ స్థాయిలో విజయాలు నమోదు చేయాలని వారంతా పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు చెప్పారు. చెప్పారు. తల్లికి వందనం ద్వారా రెండు లక్షల 50 వేల మంది విద్యార్థులకు 364 కోట్లు, దీపం పథకం ద్వారా 17 లక్షల 5వేల మందికి సిలిండర్లను పంపిణీ చేయగా 146 కోట్లు సబ్సిడీ అందించినట్లు పేర్కొన్నారు. ఇంకా స్త్రీ శక్తి పథకం, దివ్యాంగ శక్తి, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఎన్టీఆర్ భరోస, మత్స్యకార సేవ, ఆటోనగర్ సేవలో ఈ ప్రభుత్వం పలు పథకాలకు నగదును అందించిందన్నారు. రెండేళ్లలో పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు ఎంతో సమర్థవంతంగా నిర్వహించి కాకినాడ జిల్లా ప్రజల మనలను ప్రభుత్వం పొందినట్లు కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాకినాడ ఆర్టీవో ఎస్ మల్లిబాబు వందన సమర్పణ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎంపీలు సానా సతీష్ బాబు, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలు పంతం వెంకటేశ్వర రావు (నానాజీ), జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఇంకా పలువురు స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# సాలెంపాలెం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సార్) ధృవీకరణ కార్యక్రమం

**కోడూరు, జూన్ 18 (వార్తాప్రభ) :** ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సార్) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ధృవీకరణ ప్రక్రియలో వీఆర్వో శ్రీ సాయి బాబు గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 180 బీఎల్ఏ, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ శ్రీ మొకా యానాధి గారు, అలాగే తెలుగు దేశం గ్రామ పార్టీ అధ్యక్షుడు మరియు పీఏసీ చైర్‌పర్సన్ శ్రీ కొప్పనాతి సత్యనారాయణ గారు పాల్గొని క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు వివరాల పరిశీలన, నమోదు వివరాల ధృవీకరణ మరియు ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించడం జరిగింది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా మరియు సమర్థవంతంగా కొనసాగేందుకు సంబంధిత ప్రతినిధులు తమ సూచనలు అందించారు. ప్రజల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.



# ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌లో ప్రవేశాల ప్రక్రియ




**ఆర్జియుకేటి, నూజివీడు,జూన్ 18 (వార్తాప్రభ) :** నూజివీడు క్యాంపస్‌లో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియ 19 మరియు 20 తారీఖులలో నిర్వహించబడనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. నూజివీడు క్యాంపస్ లోని శాక్ ఆడిటోరియంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుంది. ప్రవేశాల సందర్భంగా ధ్రువపత్రాల పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందని, అభ్యర్థులు ముందుగా తమ ప్రవేశ వివరాలను పరిశీలించుకుని, అవసరమైన అన్ని పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆర్జియుకేటి ప్రవేశాల కన్వీనర్ మరియు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ తెలియజేశారు. ప్రవేశాల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా క్యాంపస్‌లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య గోపాలరాజు వెల్లడించారు.

# నూతన చట్టాలపై పోలీసులు అవగాహన



**కిర్లంపూడి,జూన్ 18 (వార్తాప్రభ) :** కిర్లంపూడి మండలంలో పోలీసులు గురువారం ముక్కోలు గ్రామంలో ఉపాధి శ్రామికులకు అవగాహనా కార్యక్రమం చేపట్టారు. జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతిరావు ఆదేశాల మేరకు కిర్లంపూడి ఎస్సై జి. సతీష్ ఆధ్వర్యంలో ఉపాధి శ్రామికులకు హెడ్ కానిస్టేబుల్ ఎ వి వి ఎస్ ఎన్ మూర్తి అవగాహన సదస్సు ముక్కోలు గ్రామంలో నిర్వహించారు.ఉపాధి శ్రామికులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు నేటి యువకులకు నూతన చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. మత్తు పదార్థాలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చట్టాలపై ప్రతి ఒక్కరూ తెలుసుకోనే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆర్థిక సహాయం




**గుడివాడ,జూన్ 18 (వార్తాప్రభ) :** స్థానిక గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన ఆరుగురు విద్యార్థులకు పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు పి.వి.ఎన్.డి. ప్రసాద్ తాతయ్య పేటేటి రామయ్య–నాంచారమ్మల జ్ఞాపకార్థం 550 మార్కులు పైన సాధించిన విద్యార్థులకు నగదును డా॥ పొట్లూరి వంశీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అయన మట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం ఎస్.ఎస్.సి. పరీక్షల్లో 590 మార్కులు దాటిన విద్యార్థులకు వచ్చిన మార్కులకు 25రెట్లు, 595 మార్కులు దాటిన విద్యార్థులకు 50 రెట్లు, 600 మార్కులు వచ్చిన విద్యార్థులకు 100 రెట్లు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రజని, బాలాజీ, హెచ్ఎం శివనాగేశ్వరి, ఎస్టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్, టిడిపి నాయకులు ఏ.శ్రీనివాసరావు, ఎస్ఎంసి చైర్మన్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హోమిపతి అసుపత్రిలో అగ్నిమాపక సిబ్బంది అవగాహన



**గుడివాడ,జూన్ 18 (వార్తాప్రభ) :** స్థానిక గురురాజు హోమియో హాస్పిటల్, తదితర అసుపత్రులలోని సిబ్బందికి అగ్ని భద్రతపై ఉపయోగపడే అవగాహన కార్యక్రమాన్ని అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ అంజనేయులు నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగం అధికంగా ఉండే సమయాలలో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయన్నారు. సిబ్బంది ఎపుడూ అప్రమత్తంగా ఉండటం తప్పనిసరిన్నారు. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే 101 టోల్ ఫ్రీ నంబర్, 08674–242299కు వెంటనే సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితులకు కొత్త ఆశలు

● ఆధునిక విధానాలతో మెరుగైన ఫలితాలు - డాక్టర్ మధుకర్




**విజయవాడ,జూన్ 18 (వార్తాప్రభ) :** క్యాన్సర్ చికిత్స రంగంలో ఆధునిక వైద్య సాంకేతికతలు, నూతన చికిత్సా విధానాలు రోగులకు మెరుగైన ఫలితాలను అందిస్తున్నాయని యశోద ఆసుపత్రి, సోమాజిగూడ యూనిట్‌కు చెందిన సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎస్. మధుకర్ తెలిపారు. విజయవాడలో గురువారం నిర్వహించిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశాలు పెరిగాయని, దీంతో చికిత్స మరింత సమర్థవంతంగా అందించగలుగుతున్నామని చెప్పారు. టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ, ప్రెసిషన్ ఆంకాలజీ వంటి ఆధునిక చికిత్సా విధానాలు రోగుల కోలుకునే అవకాశాలను పెంచుతున్నాయని వివరించారు. రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి స్వభావం, జన్యుపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని వ్యక్తిగతీకరించిన చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. రక్త సంబంధిత క్యాన్సర్లు, రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లకు యశోద ఆసుపత్రిలో ఆధునిక చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించి సమర్థవంతంగా చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు. డాక్టర్ మధుకర్ సర్జకల్ ఆంకలోజిస్ట్ విజయవాడ బెస్ట్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ ప్రతి నెల 3వ గురువారం అందుబాటులో ఉంటారు. ఈ సమావేశంలో డాక్టర్ బొల్లు శ్రీ తేజ మేడమ్, యశోద ఆసుపత్రి మార్కెటింగ్ విభాగం ఏజీఎం వెంకటేశ్వరరావు వీరంకి, మార్కెటింగ్ మేనేజర్ రెంటాలా విజయ్ కుమార్, ఎస్.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జెనీవీస్ రెమిడీస్ ఫార్మసీ ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన ఔషధాలు..

● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్.. ● అమలాపురంలో జారో ఫార్మసీ షాపులను ప్రారంభించిన మంత్రి..

**అమలాపురం,జూన్ 18 (వార్తాప్రభ) :** జెనీవీస్ రెమిడిస్ ఫార్మసీ ఔట్‌లెట్ల ద్వారా అత్యంత తక్కువ ధరలకే నాణ్యమైన జనరిక్ ఔషధాలు లభిస్తాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అమలాపురం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు జెనీవీస్ రెమిడిస్ జారో ఫార్మసీ మందుల షాపులను గురువారం మంత్రి సుభాష్ ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా అత్యంత విశ్వసనీయ సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన జెనీవీస్ రెమిడిస్ ఫార్మసి సంస్థ ద్వారా అత్యంత తక్కువ ధరలకు లభించే జనరిక్ ఔషధాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావడంలో జనరిక్ ఔషధాల పాత్ర కీలకమన్నారు. దేశ ప్రధాని జన ఔషధి కాన్సెప్ట్ ప్రకారం ఈ జెనివిస్ రెమిడిస్ ఫార్మసీ ముందుకు వచ్చి జనరిక్ మందులను అత్యంత తక్కువ ధరలకే అందిస్తుందన్నారు.. ఏపీలో కూడా ఈ సంస్థ ప్రస్థానం దిగ్విజయంగా ముందుకు వెళ్లి ప్రజల విశ్వసనీయతను పొందాలని మంత్రి ఆకాంక్షించారు. జెనీవీస్ రెమిడిస్ ఫార్మసి మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ షెడ్జీ మాట్లాడుతూ జనరిక్ మందులపై



ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అందరికీ అందుబాటు ధరల్లో ఔషధాలు అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. దేశంలో మూడో కార్పోరేట్ సంస్థ గా గుజరాత్, మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్ తదితర రాష్ట్రాల్లో 2000కు పైగా స్టార్స్ ఉన్నాయని, ఏపీలోనూ ఈ ఏడాది ఏప్రిల్ 12 నుంచి ప్రవేశించామన్నారు. ఇక్కడ ప్రజల విశ్వసనీయత పొందుకోవడమే తమ లక్ష్యం అన్నారు. సంస్థ రాష్ట్ర హెడ్ తిరుమల్ల శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 45 షాపులను ప్రారంభించామని, రాబోయే రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని ఔట్‌లెట్లు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. విజయవాడ రీజనల్ హెడ్ మోటమర్రి లక్ష్మీ గణేష్ మాట్లాడుతూ కోనసీమ ప్రాంత కేంద్రమైన అమలాపురంలో రెండు, పార్లపూడిలో ఒక ఔట్‌లెట్ ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలు, నిరుద్యోగ యువత జెనీవీస్ రెమెడీస్ ఫ్రాంచైజీలు పొందడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జెనీవీస్ రెమెడీస్ జారో ఫార్మసీ ఔట్ లెట్ అధినేత బోనగిరి రమేష్, విశాఖ రీజనల్ హెడ్ పూసలపాటి ఫణీంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, జిల్లా కార్యదర్శి గంధం పల్లంరాజు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్య దర్శులు చెరుకూరి సాయిరాం, పెచ్చెట్టి విజయలక్ష్మి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ,బీజేపీ అధికార ప్రతినిధి నల్లా పవన్, నాయకులు బోనం సత్తిబాబు, చెల్లుబోయిన శ్రీను, ఏడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శ్రవంతి ట్రస్ట్ సౌజన్యంతో 10 వ తరగతి విద్యార్ధులకు ప్రతిభా పురస్కారాలు

**హనుమాన్ జంక్షన్,జూన్ 18 (వార్తాప్రభ) :** బాపులపాడు మండల ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థుల విజయోత్సవ అభినందన సభ కార్యక్రమం శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన P4 కార్యక్రమం లో భాగంగా నేడు బాపులపాడు మండల ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించే ఉద్దేశంతో అందరికీ విద్య ఇది మనందరి బాధ్యత అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్య ప్రసాద్ శ్రీదేవి దంపతులు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నినాదం పై కార్యక్రమ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలలో పేద ప్రగతి గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎంతో కాలంగా శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తుందని సత్య ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు డివి రమణ ముఖ్యఅతిథిగా మాజీ గన్నవరం శాసనసభ్యులు దాసరి బాలవర్ధన్ రావు, గన్నవరం శాసనసభ్యులు ప్రభుత్వవిప్ యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్ ,సత్య ప్రసాద్ కుటుంబ సభ్యులు డాక్టర్ వీరమాచినేని స్వరాజ్యం, డాక్టర్ పోలవరపు కళ్యాణ చక్రధర్, డాక్టర్ వీరమాచినేని శ్రవంతి, డాక్టర్ గొర్రెపాటి అశోక్, గుడివాడ ఉప విద్యాశాఖ అధికారి కొండా రవి కుమార్,మండల విద్యాశాఖ అధికారులు రాంబాల్ సింగ్,కొమ్మా విజయ్ మానవతా రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరావు , లైన్స్ క్లబ్ అధ్యక్షులు పంచకర్ల చక్రవర్తి,,పలు జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మానవతా హనుమాన్ జంక్షన్ అధ్యక్షులు గంటా ఇందిరాదేవి, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్ర రావు, పలు విద్యవేత్తలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు. మాజీ గన్నవరం ఎమ్మెల్యే దాసరి బాలవర్ధన్ రావు మాట్లాడుతూ స్రవంతి ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్య ప్రసాద్ తమ ట్రస్టు ద్వారా





చేస్తున్న సేవలను కొనియాడారు.ఈ సేవలను విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్య ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్, పూలె,సర్వేపల్లి రాధాకృష్ణన్,,అబ్దుల్ కలాం లాంటి మహనీయులు జీవితాలు మనకు ఆదర్శం అని ,అందరూ విద్య ద్వారానే గౌరవింపబడతారని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని మనమందరం ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాలని పేద విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు.గుడివాడ ఒక విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ మాట్లాడుతూ విద్య ద్వారానే అత్యున్నతమైన పరిపాలన ఉద్యోగమైన ఐఏఎస్ ఐపీఎస్ డాక్టర్లు ఇంజనీర్లు తదితర సాంకేతిక నిపుణులు గా వివిధ ఉద్యోగాలు పొందుతారని, ప్రతి ఒక విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పే అన్ని అంశాలు అర్థవంతంగా నేర్చుకుని నైపుణ్యవంతమైన విద్యార్థులుగా మెలగాలని సూచించారు ఆంధ్రప్రదేశ్ క్రీడారంగానికి చెందిన SAP ప్రోగ్రాం లో భాగంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు గోల్డ్ మెడలు మరియు మైక్ సెట్ ఆ సంస్థ నిర్వాహకులు క ట్టా సుధాకర్ కు అందించి క్రీడా రంగానికి అతను చేస్తున్న కృషిని అభినందించారు గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి మండల ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నగదు బహుమతి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ మరియు ప్రోత్సహించారు మండలంలో గల అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పదవ తరగతి ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన పాఠశాలల వారికి అప్పన వీడు మరియు జ్యోతి హైస్కూల్,జె ఎం జె కాలేజీ, హైస్కూల్ ప్లస్ బాపులపాడు ఇఁట టర్ ప్రథమ ద్వితీయ సంవత్సర విద్యార్థులందరికీ ప్రోత్సాహక నగదు బహుమతులు అందించి వారి విద్యాభివృద్ధికి స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ చేదోడుగా ఉంటుందని సత్య ప్రసాద్ తెలిపారు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ వార్డు సాధించిన జి శ్రీనివాసరావును ఈ సందర్భంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి సంగోజు వెంకట చలపతిరావు, జనవిజ్ఞాన వేదిక బాపులపాడు మండల కార్యదర్శి దారపురెడ్డి భాస్కరరావు,దయాల ప్రభాకర్ రావు, రాజులపాటి బుష్యారావు, పత్తిపాటి రమేష్, యార్లగడ్డ సత్యన్నారాయణ, వడ్లమూడి ఆంజనేయులు, వీరమాచినేని బుజ్జి, కడగల శ్రీనివాసరావు,గొట్టాపు వాసు, ముత్యాల సువర్ణరాజు, లు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

# బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతే లక్ష్యం: తోకల రామకృష్ణ

● బీసీవై అధినేత బోడె రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ ● మహిళలు, వృద్ధులకు చీరల పంపిణీ అన్నదాన కార్యక్రమం.



**కైకలూరు,జూన్ 18 (వార్తాప్రభ) :** బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు గురువారం కైకలూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక సివిఆర్ గార్డెన్స్‌లో కైకలూరు నియోజకవర్గ బీసీవై పార్టీ కన్వీనర్ తోకల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోకల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి బీసీవై పార్టీ కట్టుబడి పనిచేస్తోందన్నారు. పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ నాయకత్వంలో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆయన, పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి రాబోయే రోజుల్లో అధికార లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కైకలూరు నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల మద్దతుతో పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.అనంతరం మహిళలు, వృద్ధులకు చీరలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్ నాగమణి, యూత్ కన్వీనర్ పాపారావు, క్రాంతి, ప్రసాద్, పాము అరవింద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పంతం నానాజీని కలిసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



**కాకినాడ,జూన్ 18 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పంతం నానాజీని రాజ్యసభ సభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు సానా సతీష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యులుగా రెండోసారి ఎన్నికైన అనంతరం తొలి సారిగా కాకినాడ జిల్లాకు విచ్చేసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, గొడారిగుంటలోని ఎమ్మెల్యే పంతం నానాజీ నివాసానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబుకు సాదర స్వాగతం పలికి ఆత్మీయంగా అభినందనలు తెలిపారు. రాజ్యసభ సభ్యులుగా మరోసారి ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజా సేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తొలిసారిగా తన నివాసానికి విచ్చేసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును ఎమ్మెల్యే నానాజీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు పంతం సందీప్, జనసేన పార్టీ నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక సంజీవని ఆసుపత్రి ప్రారంభం



**అమలాపురం,జూన్ 18 (వార్తాప్రభ) :** అమలాపురం సంజీవిని నూతన ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అమలాపురం ఎమ్మెల్యేలు అయితా బత్తుల ఆనందరావు. డాక్టర్ మధుసూదన్ రావు కుమారుడు డాక్టర్ రోహిణి మూర్తి కుమార్తె దంపతులు అత్యాధునిక చిల్డ్రన్స్ హాస్పిటల్ ను నిర్మించారు. అధునాతనమైన ఎన్ ఎస్ యు సదుపాయాలు ఈ ఆసుపత్రి లో కల్పించారు. ఎమ్మెల్యే ఆనందరావు తో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పెచ్చేట్టి విజయలక్ష్మి, ఖజూబఘయి జిల్లా అధ్యక్షులు మండేల బాబీ, డాక్టర్ రోహిణి మూర్తి, డాక్టర్ శారదా, డాక్టర్ అక్కినపల్లి వెంకట రమణ,డాక్టర్ అక్కినపల్లి శ్రావ్య, డాక్టర్ కావ్య తదితరులు.

# ఓటర్ లీ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కృత్తివెన్ను టిడిపి నాయకులు....



**కృత్తివెన్ను,జూన్ 18 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను గ్రామంలో గురువారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) మండల టిడిపి నాయకులు నిర్వహి ంచారు. వారు ఇంటింటికి తిరుగుతూ పాత ఓటర్ కార్డు లోని డేటాను పరిశీలించి మార్పులు చేర్పులను సరిచూసుకున్నారు. ఈ కార్యక్రమం జూన్ నెల 15వ తారీకు నుంచి జూలై నెల 14వ తారీకు వరకు జరుగుతుందని ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను శివాలయం చైర్మన్ చేకూరి వెంకట్రావు, అధికారి అప్పి టిడిపి ముఖ్య నేతలు పాల్గొన్నారు

# ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● 26 మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య





**పెనుగంచిప్రోలు, జూన్ 18 (వార్తాప్రభ) :** జగ్గయ్యపేట నియోజకవర్గ ంలోని పెనుగంచిప్రోలు మండలానికి చెందిన 26 మంది వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అనంతరం వచ్చిన భారీ వైద్య ఖర్చులను భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారి మెడికల్ బిల్లులను స్థానిక నాయకుల ద్వారా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య దృష్టికి తీసుకువచ్చారు. బాధితుల పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్ తాతయ్య వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్ ) ద్వారా ఆర్థిక సహాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వారి సిఫార్సు మేరకు దరఖాస్తులను పరిశీలించిన ప్రభుత్వం 26 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.15,04,479 ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా పెనుగంచిప్రోలు గ్రామంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారినప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తాను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆపదలో ఉన్నా తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ఎమ్మెల్యే తాతయ్య కి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ తాతయ్య ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, గ్రామ సొసైటీ చైర్మన్ కర్ల వెంకటనారాయణ, మాజీ ఎంపీటీసీ గజ్జి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు, చుంచు రమేష్,గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్ కుమార్ , నీటి సంఘం అధ్యక్షులు కర్ల నాగేశ్వరరావు, నూతలపాటి కృష్ణ, బీసీ నేత కొల్లిపాక బ్రహ్మం, జామ ఆనందరావు, చింతా రవి, లింగయ్య, కంచేటి రాంబాబు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గుడివాడ అమర్నాథ్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి..

● దళితులను కించపరిచే సహించేది లేదు.... ● రాష్ట్ర హోం మంత్రి అనితకు అమర్నాథ్ క్షమాపణ చెప్పాలి....

● డీఎస్సీ పై జగన్ మాట్లాడటం సిగ్గుచేటు.. ● టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతర్ల రమేష్ ....



**అమరావతి,జూన్ 18 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో మహిళలను కించపరిచే విధంగా ఎవరు మాట్లాడిన వారిని ఉపేక్షించేది లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతర్ల రమేష్ అన్నారు. అమరావతిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భాష అదుపులో పెట్టుకోకుండా రాష్ట్ర హోంమంత్రి శ్రీమతి వంగల పూడి అనిత ను వేష భాషల కోసం దగుల్బాజీ ప్రేలాపన పేలిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాద్ పై యస్సీ యస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి. ఆయన్ను అరెస్ట్ చేయాలని రాష్ట్ర డిజిపి కి పంపిన లేఖలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత పై వైసీపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలు విధానాలపై రాజకీయ విమర్శలు చెయ్యాలేకానీ అలా కాకుండా, ఒక దళిత మహిళా మంత్రిని ఉద్దేశ్య పూర్వకంగా దిగజారి మాట్లాడటం వైసీపీ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. గొడ్డలి పార్టీ వారి దుర్మార్గ, అహంకారపూరిత సంస్కృతికి నిదర్శనమని పాతర్లరమేష్ మండిపడ్డారు. ప్రజల కోసం శాంతిబద్ధతలు పరిరక్షించడం కోసం నిరంతరం శ్రమిస్తున్న హంమంత్రి అనిత ను అవమానించడం అంటే ఆంధ్రప్రదేశ్ మహిళా లోకాన్ని అవమానపర్చడమేనని ఆయన అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణపై సమాధానం చెప్పలేక, ఆధారాలు లేని ఆరోపణలు, అసభ్య పదజాలంతో ప్రజల దృష్టిని మరల్చి రాజకీయ లబ్ధి పొందాలని గొడ్డలి పార్టీ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటు అని ఆయన అన్నారు.హోం మంత్రి అనిత పై అమర్నాథ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు మహిళా మంత్రిని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు దిగటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో దళితులను ఎవరు కించపరిచిన సహించేది లేదని ఆయన హెచ్చరించారు. మెగా డీఎస్సీ పై గొడ్డలి పార్టీ తమ కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తుందని ఆయన విమర్శించారు. డీఎస్సీ పై జగన్ మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో జగన్ హయాంలో ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల వద్ద కాపలా పెడితే, కూటమి ప్రభుత్వం వచ్చాక, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఉపాధ్యాయులను విదేశాలకు పంపిన ఘనత కూటమి ప్రభుత్వానికి లోకేష్ కే, దక్కిందని ఆయన కొనియాడారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తుందని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం పై గొడ్డలి పార్టీ బురద చల్లడం కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

# ముసునూరులో బోర్ మోటార్ల వైర్ల దొంగల ముఠా అరెస్ట్: ఎస్ఐ చిరంజీవి చాకచక్యం



**ముసునూరు,జూన్ 18 (వార్తాప్రభ) :** రాత్రింబవళ్లు కష్టపడి పంటలు పండించే అన్నదాతల బోర్ మోటార్ల వైర్లను దొంగిలిస్తూ, రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ముసునూరు పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి దొంగిలించిన వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఒకేసారి 10 పొలాల్లో దొంగతనం జరిగింది. ముసునూరు మండల పరిధిలో పలువురు రైతుల పొలాల్లోని బోర్ మోటార్ల వైర్లు అకస్మాత్తుగా మాయమవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒకేసారి సుమారు పదిమంది రైతుల పొలాల్లో ఈ దొంగతనాలు జరగడంతో ఆందోళన చెందిన రైతులు ముసునూరు ఎస్.ఐ ఎం. చిరంజీవిని ఆశ్రయించారు. రైతుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన ఎస్.ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్, నూజివీడు డిఎస్పీ కె.వి.ఎన్.వి. ప్రసాద్ ల ఆదేశాల మేరకు.. నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ ఐ.వి. నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఎస్.ఐ చిరంజీవి తన సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా పెట్టారు. దొంగతనాలను అరికట్టేందుకు స్వయంగా రాత్రి వేళల్లో గస్తీని పెంచి, ప్రతి అనుమానాస్పద వాహనాన్ని తనిఖీ చేయడం ప్రారంభించారు. పోలీసుల చేతికి చిక్కిన నిందితులు పోలీసులు రాత్రి గస్తీ నిర్వహిస్తుండగా, ద్విచక్ర వాహనాలపై వైర్ల మూటలతో వెళ్తున్న కొందరు వ్యక్తులు కనిపించారు. బీట్ సిబ్బంది వారిని అడ్డగించగా, నిందితులు పోలీసుల నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. అయితే పోలీసులు వారిని వెంటాడి విజయవంతంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు పూర్తిగా గంజాయికి బానిసలని, తమ మత్తు పదార్థాల జులాయి ఖర్చుల కోసం, సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఉద్దేశంతోనే ఈ మోటార్ వైర్ల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించబడిన వైర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో, చట్టం ముందు అందరూ సమానులే అని నిరూపిస్తూ పోలీస్ సిబ్బంది ముద్దాయిలను కోర్టు వరకు నడిపించుకుంటూ తీసుకెళ్లి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. రైతులకు పెను భారంగా మారిన దొంగతనాల ముఠాను కట్టడి చేసిన ఎస్.ఐ చిరంజీవిని, వారి పోలీస్ సిబ్బందిని స్థానిక రైతులు ప్రత్యేకంగా అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ముసునూరు మండల పరిధిలో ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాత్రిపూట గస్తీని మరింత కఠినతరం చేస్తాం. రైతుల ఆస్తులకు, వ్యవసాయ క్షేత్రాలకు పూర్తి రక్షణ కల్పిస్తాం. రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ముసునూరు ఎస్సై ఎం చిరంజీవి తెలిపారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188